







విద్యుత్ వెలుగుల్లో సీఎస్ఐ చర్చి

క్రిస్మస్ పురస్కరించుకుని సిద్దిపేట సీఎస్ఐ సీడబ్ల్యూ పాసినేట్ చర్చిని రంగు రంగుల విద్యుత్ దీపాలతో ఆకర్షణీయంగా అలంకరించారు. చర్చి కాంపౌండ్ లోని వేప చెట్టుకు స్టార్ లైట్స్ అమర్చడంతో ఆ ప్రాంతం శోభాయమానంగా మారింది. చర్చిలో ప్రత్యేక ప్రార్థనలు చేస్తున్నారు. ఈ మేరకు ఈ ఆదివారం నుంచి వారం రోజుల పాటు క్యారెల్స్ కార్యక్రమం నిర్వహిం చనున్నారు. సంఘ సభ్యులు, కమిటీ సభ్యులు, యువజనులు ఇంటింటికీ వెళ్తూ యేసు గీతాలు ఆలపిస్తూ క్రిస్మస్ శుభాకాంక్షలు తెలుపనున్నారు.

- సిద్దిపేట జిల్లా స్టాఫ్ ఫొటోగ్రాఫర్

రెండో రోజు గ్లోబల్ సమ్మిట్‌లో నిర్మలాజగ్గారెడ్డి

సీఎం, మంత్రులతోపాటు డాక్యుమెంట్ ఆవిష్కరణలో పాల్గొన్న టీజీఐఐసీ చైర్‌పర్సన్

సంగారెడ్డి రూరల్ డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి) : తెలంగాణ రైజింగ్ గ్లోబల్ సమ్మిట్ రెండో రోజు సైతం పెట్టుబడుల వరద కొనసాగింది. సమ్మిట్ రెండో రోజైన మంగళవారం నాడు తెలంగాణ రాష్ట్రానికి వివిధ రంగాల్లో రూ. 1,11,395 కోట్లకుపైగా పెట్టుబడులు వచ్చాయి. మొత్తం రెండు రోజుల్లో కలిపి సుమారు రూ.3 లక్షల కోట్ల పెట్టుబడి ఒప్పందాలు (ఎంవోయూ) కుదిరాయి. రెండో రోజు రిలయన్స్ కన్స్యూమర్ ప్రొడక్ట్స్ లిమిటెడ్, అరబిందో ఫార్మా, హెటిరో, భారత్ బయోటెక్ లాంటి ప్రధాన సంస్థలతో అవగాహన ఒప్పందాలు కుదుర్చుకున్నారు. తెలంగాణ రైజింగ్ 2047 విజన్ డాక్యుమెంట్ ఆవిష్కరణ రాష్ట్ర ప్రభుత్వం 2047 నాటికి తెలంగాణను ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా మార్చే లక్ష్యంతో రూపొందించిన తెలంగాణ రైజింగ్ 2047 విజన్ డాక్యుమెంట్‌ను ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో టీజీఐఐసీ చైర్‌పర్సన్ నిర్మలా జగ్గారెడ్డి పాల్గొన్నారు.



హైదరాబాద్‌లో నిర్వహించిన గ్లోబల్ సమ్మిట్‌లో ఆసీనులైన టీజీఐఐసీ చైర్‌పర్సన్ నిర్మలాజగ్గారెడ్డి

ఒట్టేయ్.. ఓటేయ్!

● పల్లెల్లో డబ్బుల పంపకం.. ఆపై ప్రమాణాలు ● ముగిసిన తొలివిడత ఎన్నికల ప్రచారం

- రేపు ఉదయం 7 గంటల నుంచి ఒంటిగంట వరకు పోలింగ్
- బెల్టుషాపులపై నిఘా.. అయినా వైన్స్ నుంచి మద్యం పంపిణీ
- దుప్పట్లు, చీరలు, ఓటుకు రూ.500 నుంచి రూ.3వేలు
- పలుచోట్ల మటన్, చికెన్, కూల్‌డ్రింక్స్, బిర్యానీ ప్యాకెట్లు

పల్లెల్లో డబ్బు, మద్యం పంపకాలు జోరుగా సాగుతున్నాయి. తొలివిడత ఎన్నికలు జరిగే గ్రామాల్లో మంగళవారం సాయంత్రం 5 గంటలతో ప్రచారం ముగిసింది. గురువారం ఉదయం 7 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట దాకా పోలింగ్ జరగనుంది. దీంతో సర్పంచ్, వార్డు అభ్యర్థులు తమ దృష్టిని ప్రలోభాలపైకి మళ్లించారు. ఇన్నాళ్లు చేసిన ప్రచారానికి ధీటుగా పంపకాలు కొనసాగిస్తేనే గెలుపు అవకాశాలు ఉంటాయని ఆదిశగా అడుగులేస్తున్నారు.

- సిద్దిపేట, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి)



తొలివిడత పంచాయతీ ఎన్నికలు జరగనున్న గజ్వేల్, మర్కుక్, ములుగు, వర్గల్, జగదేవ్‌పూర్, రాయపోల్, దౌల్తాబాద్ మండలాల్లో నిశబ్ద వాతావరణం నెలకొంది. ప్రచారం ముగియడంతో గుట్టుగా నగదు పంపిణీకి తెర దీశారు. అదే విధంగా వెండి కుంకుమ భరణిలు, చీరలు పంపిణీ చేస్తున్నారు. కొన్ని గ్రామాల్లో మటన్, చికెన్, కూల్ డ్రింకులు సైతం అందజేస్తున్నారు.

గుట్టుగా మద్యం పంపిణీ..

సిద్దిపేట పోలీస్ కమిషనర్‌గా విజయ్‌కుమార్ బాధ్యతలు చేపట్టిన తర్వాత బెల్టుషాపులపై కొరఢా ఝులిపించారు. ప్రతీ గ్రామంలో 10కి పైగానే ఉండే ఈ బెల్టుషాపులను అక్రమంగా నిర్వహిస్తున్నారని గుర్తించి తనిఖీలు చేపట్టారు. ఇప్పటికే జిల్లావ్యాప్తంగా 228 కేసులు నమోదు చేసి రూ.21లక్షల విలువైన మద్యాన్ని సీజ్ చేశారు. బెల్టుషాపులను తెరవాలంటేనే నిర్వాహకులు వణుకుతున్నారు. గతంలో అభ్యర్థులు బెల్టుషాపుల్లోనే ఓటర్లను సంతృప్తి చేసేవారు. లేదంటే ఇంటింటికీ తిరిగి మద్యం సీసాలు అందించేవారు. కానీ నేడు బెల్టుషాపులు పూర్తిగా మూసివేయించారు. వైన్‌షాపుల వద్ద కూడా నిఘా పెట్టారు. నాలుగైదు క్వార్టర్, ఫుల్‌బాటిల్ సీసాల కంటే ఎక్కువ తీసుకెళ్తే సీజ్ చేస్తున్నారు. రూ.150 విలువైన క్వార్టర్ సీసాకు బదులు రూ.200 నోటు ఇచ్చినా ఓటర్లు సంతృప్తి చెందడం లేదని ఓ అభ్యర్థి తనకు జరిగిన అనుభవాన్ని వివరించాడు. అయినప్పటికీ మద్యం పంపిణీ మాత్రం ఆగడంలేదు.

చీటీ తీసుకో.. సీసా తెచ్చుకో..

అభ్యర్థులకు మద్యం పంపిణీ కత్తిమీదసాములా మారింది. తాము గెలవాలంటే మద్యం ఖచ్చితంగా పంపిణీ చేయాల్సి ఉంటుందని గుర్తించారు. కానీ పోలీసుల నిఘా కారణంగా మద్యం నిల్వలను సమకూర్చుకోలేకపోతున్నారు. అందుకే వైన్‌షాపుల్లో ఖాతాలు తెరిచారు. తమ గ్రామ ఓటరుకు తమ సంతకంతో వచ్చిన చీటీ చూపిస్తే ఒకటి లేదా రెండు సీసాలు ఇవ్వాలని ఒప్పందం చేసుకున్నట్లు తెలిసింది. చాలాచోట్ల ఇదే పద్ధతిని అవలంబిస్తున్నట్లుగా చర్చ జరుగుతోంది.

మిగతా 8లో...

మొదలైన పంపకాలు..

- వర్గల్ మండలంలోని పలు గ్రామాల్లో ఓటుకు రూ.500 నుంచి రూ.వెయ్యిదాకా పంపిణీ చేస్తున్నట్లు తెలిసింది. మద్యం కూడా రహస్యంగా అందిస్తున్నారు. వార్డు అభ్యర్థులు కూడా కూల్‌డ్రింకులు, ఇంటికి కిలో చికెన్ పంపిణీ చేస్తున్నారు.
- రాయపోల్ మండలంలో అభ్యర్థులు మద్యం పంపిణీ చేయాలని భావిస్తుండగా పోలీసులు ప్రత్యేక దృష్టి సారించడంతో డబ్బు మాత్రం అందజేస్తున్నారు.
- ములుగు మండలం కొత్తూరు గ్రామంలో ఒక్కో ఓటుకు రూ.3వేల దాకా ఇస్తున్నట్లు తెలుస్తోంది. రియల్‌ఎస్టేట్ పరంగా గ్రామాలకు ఆదాయ వనరులు ఉండడంతో రూ.వెయ్యి నుంచి రూ.3వేల దాకా పెట్టడానికి అభ్యర్థులు సిద్ధమయ్యారు.
- మర్కుక్ మండలంలో రూ.1000 నుంచి రూ.2 వేలతో పాటు మద్యం, కూల్‌డ్రింకులు అందిస్తున్నారు.
- జగదేవ్‌పూర్ మండలంలోని పలు గ్రామాల్లో విచ్చలవిడిగా మద్యం పంపిణీ చేస్తున్నారు. చలికాలం కావడంతో పలువురు అభ్యర్థులు దుప్పట్లు, స్వెటర్లు పంపిణీ చేశారు. ఓటుకు రూ. వెయ్యి దాకా ఇస్తున్నారు.

మూడో విడత తేలిన లెక్క

- 13 పంచాయతీలు, 210 వార్డులు ఏకగ్రీవం
- అభ్యర్థులకు గుర్తులు కేటాయింపు
- ఇక ఊపందుకోనున్న ప్రచారం

హుస్నాబాద్, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో మూడో విడత గ్రామ పంచాయతీ ఎన్నికల నామినేషన్ల ఉపసంహరణ ఘట్టం మంగళవారం ముగియడంతో బరిలో ఉండే అభ్యర్థుల లెక్క తేలింది. పోటీలో ఉండే అభ్యర్థులకు గుర్తులు కేటాయించారు. ఇక ప్రచారం ఊపందుకోనుంది. జిల్లాలో హుస్నాబాద్, అక్కన్నపేట, కోహెడ, కొమురవెల్లి, కొండపాక, కూకునూరుపల్లి, దూళ్మిట్ట, మద్దూర్, చేర్యాల మండలాల్లో 163 గ్రామ పంచాయతీలకు 1432 వార్డులకు ఈ నెల 17న ఎన్నికలు జరుగనున్నాయి. ఈ మండలాల్లో 1191 మంది సర్పంచ్ స్థానాలకు, 3840 మంది వార్డు స్థానాలకు నామినేషన్లు వేశారు. 357 సర్పంచ్, 289 వార్డు అభ్యర్థుల నామినేషన్లు తిరస్కరణ అయ్యాయి. ఇందులో సర్పంచ్‌లకు 299, వార్డులకు 269 వార్డులకు తమ నామినేషన్లను ఉపసంహరించుకున్నారు. కాగా హుస్నాబాద్ మండలంలో 3 సర్పంచ్, 35 వార్డులు, అక్కన్నపేట మండలంలో 6 సర్పంచ్‌లు, 87 వార్డులు, కోహెడ మండలంలో 2 సర్పంచ్‌లు, 44 వార్డులు, చేర్యాల మండలంలో 18 వార్డులు, కుకునూరుపల్లి మండలంలో 2 సర్పంచ్‌లు, 14 వార్డులు, కొండపాక మండలంలో 9 వార్డులు, కొమురవెల్లి మండలంలో 3 వార్డులు ఏకగ్రీవం అయ్యాయి. మొత్తం 13 గ్రామ పంచాయతీలు ఏకగ్రీవం కాగా ప్రస్తుతం 150 పంచాయతీలకు, ఎన్నికలు జరుగనున్నాయి. అలాగే 1432 వార్డులకు 210 వార్డులు ఏకగ్రీవం కాగా 1222 వార్డులకు ఎన్నికలు జరుగనున్నాయి.

మూడోవిడత ఎన్నికల్లో గ్రామ పంచాయతీలు 163, వార్డులు 1,432 (బ. అ : బరిలో అభ్యర్థులు)

మండలం	పంచాయతీలు	బ.అ	వార్డులు	బ.అ
హుస్నాబాద్	17	59	140	296
కోహెడ	27	87	244	511
అక్కన్నపేట	38	125	306	604
మద్దూర్	10	41	98	246
దూళిమిట్ట	11	39	94	212
చేర్యాల	20	80	184	433
కొమురవెల్లి	11	47	100	280
కొండపాక	15	71	146	423
కూకునూరుపల్లి	14	31	120	217

ఏకగ్రీవమైన పంచాయతీలు..

అక్కన్నపేట మండలంలోని కెప్టెన్ చౌడు తండా, గొల్లపల్లి, శ్రీరామ్ తండా, కుందనవానిపల్లి, దాసుతండా, దుబ్బతండాతో పాటు కోహెడ మండలంలోని విజయనగర్ కాలనీ, నకిరె కొమ్ముల, హుస్నాబాద్ మండలంలోని రాములపల్లి, వంగరామయ్యపల్లి, తోటపల్లి, కూకునూరుపల్లి మండలంలోని రామచంద్రాపూర్, పీటీ వెంకటపూర్ గ్రామ పంచాయతీలు ఏకగ్రీవమయ్యాయి.

ఆకునూరులో 11మంది పోటీ

చేర్యాల, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): చేర్యాల మండలంలోని ఏకైక మేజర్ గ్రామపంచాయతీ ఆకునూరు గ్రామంలో సర్పంచు స్థానానికి అత్యధికంగా 11మంది బరిలో నిలిచారు. ఇటీవల 14 మంది నామినేషన్లు దాఖలు చేయగా, ముగ్గురు ఉపసంహరించుకున్నారు. వీరిలో పలువురు కాంగ్రెస్, బీఆర్ఎస్ నేతలు ఉండగా, పార్టీ ఒక్కరికే మద్దతు ఇవ్వగా, మిగతా వారు రెబెల్స్‌గా పోటీ చేస్తున్నారు. ఈనేపథ్యంలో రెబెల్స్ బెడదతో ఓట్లు చీలి గెలుపు, ఓటములను ప్రభావితం చేయనుండటంతో అందరూ మీమాంసలో పడిపోయారు. కాగా 11గుర్తులతో పా టు నోటా ఉండటంతో జంబో బ్యాలెట్ పేపర్ ఏర్పాటు చేయనుండగా, గుర్తుల విషయంలో ఓటర్లు అయోమానికి గురయ్యే పరిస్థితి నెలకొనడంతో అభ్యర్థులు తలలు పట్టుకుంటున్నారు. గ్రామపంచాయతీ ఎన్నికల సందర్భంగా చేర్యాల మండలం పోతిరెడ్డిపల్లి గ్రామానికి చెందిన ఓ అభ్యర్థి ప్రదర్శించిన అత్యుత్సాహం వలన ఏకగ్రీవ ఆశలు ఆవిరవడంతో తల పట్టుకుంటున్నాడు.



హుస్నాబాద్ మండలం గాంధీనగర్‌లో ఏకగ్రీవం కోసం ప్రయత్నిస్తున్న నాయకులు



హైదరాబాద్‌లోని ప్రజాభవన్‌లోని సీఎం ప్రవాసీ ప్రజావాణిలో వినతిపత్రం అందజేస్తున్న అబ్దుల్ సతీమణి

మలేషియా జైలులో ఏడాదిగా పోతరెడ్డిపేట వాసి



అబ్దుల్‌ఖాదర్

దుబ్బాక, డిసెంబరు 9, (ఆంధ్రజ్యోతి): పొట్టచేతపట్టుకుని దేశంగానీ దేశం వెళ్లిన ఒక అభాగ్యుడు మలేషియాలోని జైలులో ఏడాదిగా మగ్గుతున్నారు. సహోద్యోగితో జరిగిన చిన్నగొడవ కారణంగా అతను జైలులో ఉన్నాడు. అక్బర్‌పేట-భూంపల్లి మండలం పోతరెడ్డిపేటకు చెందిన మహ్మద్ అబ్దుల్ ఖాదర్ మలేషియాలోని సంగాయ్‌పెటానీ జైల్‌లో మగ్గుతున్నాడంటూ ఆ కుటుంబం మంగళవారం హైదరాబాద్‌లోని ప్రజాభవన్‌లోని సీఎం ప్రవాసీ ప్రజావాణిలో వినతిపత్రం అందజేశారు. గ్రామానికి చెందిన అబ్దుల్‌ఖాదర్ (50) గ్రామంలో కూలి పని చేసుకుని జీవించేవాడు. ఆయనకు భార్య సలీమాబేగం, ముగ్గురు కుమారులున్నారు. అబ్దుల్‌ఖాదర్ 2016లో బతుకుదెరువు కోసం మలేషియాకు వెళ్లారు. అక్కడ తన సహోద్యోగితో జరిగిన గొడవలో గతేడాది అరెస్టయ్యారు. ఆ కుటుంబం ఏడాదిగా ఆందోళన చెందుతుంది. మలేషియాలోని అబ్దుల్ ఖాదర్ పరిస్థితిని తెలుసుకున్న తెలంగాణ ప్రభుత్వ నియమిత, ఎన్నారై అడ్వయిజరీ కమిటీ వైస్‌ఛైర్మన్ మంద భీంరెడ్డి స్పందించి, ఇటీవల టీపీసీసీ అధ్యక్షులు మహేష్‌కుమార్‌గౌడ్ దృష్టికి తీసుకెళ్లారు. తమ భర్తకు న్యాయం చేయాలని, జైలు నుంచి విడిపించాలంటూ ఆయన సతీమణి సలీమాబేగం మంగళవారం ఎన్నారై అడ్వయిజరీ కమిటీ వైస్ ఛైర్మన్ మంద భీంరెడ్డి కలిసి సీఎం ప్రవాసీ ప్రజావాణిలో వినతిపత్రం అందజేశారు.

కల్యాణానికి ముస్తాబవుతున్న కొమురవెల్లి మల్లన్న

కొమురవెల్లి, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): కొమురవెల్లి మల్లన్న కల్యాణానికి ముస్తాబవుతున్నాడు. గర్భాలయంలోని స్వామివారి మూల విరాట్‌ను పంచరంగులతో అలంకరిస్తున్నారు. అర్థ మండపంలో ఉన్న విగ్రహాలను, మహా మండపాన్ని, స్వామి వారి రథాన్ని కోనేరులో ఉన్న శివుడి విగ్రహానికి, ఆలయ రాజగోపురానికి రంగులు వేసి అలంకరిస్తున్నారు. వచ్చే ఆదివారం కల్యాణం నిర్వహించనున్నారు.

ఓటు హక్కును వినియోగించుకోవాలి : కలెక్టర్

- 11న ఏడు మండలాల పరిధిలోని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలు, కార్యాలయాలకు సెలవు

గజ్వేల్, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): ప్రతి ఒక్కరూ తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని కలెక్టర్ కట్టా హైమావతి పిలుపునిచ్చారు. ఈ నెల 11న గజ్వేల్ డివిజన్ పరిధిలోని 147 గ్రామ పంచాయతీలు, 1207 వార్డుల్లో మొదటి విడతలో ఎన్నికలు జరగనున్నాయని, ఆయా మండలాల పరిధిలోని, గ్రామాల పరిధిలోని ప్రభుత్వ, ప్రైవేట్ కళాశాలలు, పాఠశాలలు, కార్యాలయాలకు సెలవు ప్రకటించారు. ఉదయం 7 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు నిర్వహించనున్న ఎన్నికల్లో పాల్గొని తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని కలెక్టర్ కోరారు.

ఎన్నికల సామగ్రి పంపిణీకి ఏర్పాట్లు పూర్తి

జగదేవ్‌పూర్, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): జగదేవ్‌పూర్‌లో ఈ నెల11న మొదటి విడత ఎన్నికలు జరగనున్న నేపథ్యంలో ఎన్నికల సామగ్రిని పంపిణీ చేయడానికి అధికారులు మంగళవారం ఏర్పాట్లు పూర్తి చేశారు. బుధవారం సామగ్రిని ఎస్‌వీ ఫంక్షన్‌హాల్‌లో పంపిణీ చేయనున్నారు. గ్రామాల వారీగా కౌంటర్లు ఏర్పాటు చేశారు. అలాగే పీవో, ఓపీవోలకు సామగ్రిని అందించడానికి సిద్ధం చేస్తున్నారు.

ఇగం.. ఆగమాగం

- గణనీయంగా పడిపోయిన ఉష్ణోగ్రతలు..

కోహీర్, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి) : ఉమ్మడి మెదక్ జిల్లా గజగజ వణుకుతోంది. ఇగం(చల్లని గాలి) వస్తుండడంతో పిల్లలు, వృద్ధులు, ఉదయం వేళ పనులకు వెళ్లే వారు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఉమ్మడి జిల్లాలో ఉష్ణోగ్రతలు సోమవారమే రికార్డు స్థాయిలో కనిష్ఠానికి పడిపోగా, మంగళవారం అంతకుమించి అత్యల్పంగా నమోదై ఈ చలికాంలోనే అతితక్కువగా రికార్డుయింది. సోమవారం సంగారెడ్డి జిల్లా కోహీర్‌లో 6.6 డిగ్రీలు నమోదు కాగా, మంగళవారం ఉదయం ఝరాసంగంలో 6.4 డిగ్రీలుగా రికార్డు అయ్యింది. ఇది రాష్ట్రంలోనే రెండో అత్యల్ప ఉష్ణోగ్రత. ఉమ్మడి మెదక్ జిల్లాలోని 65 ప్రాంతాల్లో సింగిల్ డిజిట్ ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. ఈ ప్రాంతాలు ఆరెంజ్ అలర్ట్‌లోకి చేరాయి.

సిద్దిపేట జిల్లాలో..

పోతరెడ్డిపేట 8.2 అంగడికిష్టాపూర్ 8.4, బేగంపేట్ 8.6, నంగునూరు 8.9, కొండపాక 8.9, అబ్బీపూర్ 8.9, తిప్పారం 9.0, వెంకటరావుపేట్ 9.2, మునిగడప్ప 9.2, దూళ్మిట్ట 9.2 తుక్కాపూర్ 9.4, గౌరారం 9.8, మిరుదొడ్డి 9.8, రాంపూర్ 9.9, ప్రాంతాల్లో సింగిల్ డిజిట్ ఉష్ణోగ్రతను నమోదు కాగా దౌల్తాబాద్ 10.2, గండిపల్లి 10.3, రేబర్తి 10.4, కనిష్ఠ ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి.

కేసీఆర్ దీక్ష ఫలితమే తెలంగాణ ప్రకటన

- బీఆర్ఎస్ నాయకులు ● ఘనంగా 'దీక్ష దివస్' ర్యాలీ



సిద్దిపేటలో తెలంగాణ తల్లి విగ్రహానికి పూలమాలలు వేస్తున్న బీఆర్ఎస్ నాయకులు

సిద్దిపేట, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ రాష్ట్ర సాధన కోసం కేసీఆర్ చేపట్టిన 11 రోజుల దీక్ష ఫలితమే 2009 డిసెంబర్ 9న తెలంగాణ రాష్ట్ర ప్రకటన వచ్చిందని బీఆర్ఎస్ నాయకులు అన్నారు. మాజీ ఎమ్మెల్సీ ఫారూక్ హుస్సేన్, పార్టీ కార్యదర్శి రాధాకృష్ణశర్మ, మున్సిపల్ మాజీ చైర్మన్ రాజనర్సులు ఈ సందర్భంగా మాట్లాడుతూ... తెలంగాణ వచ్చుడో, కేసీఆర్ సచ్చుడో అనే నినాదంతో కేసీఆర్ చేపట్టిన దీక్ష చరిత్రలో నిలిచిపోతుందన్నారు. బీఆర్ఎస్ రాష్ట్ర పార్టీ పిలుపు మేరకు, ఎమ్మెల్యే హరీశ్‌రావు సూచనతో పట్టణ అధ్యక్షుడు కొండం సంపత్‌రెడ్డి ఆధ్వర్యంలో మంగళవారం 'దీక్ష విజయ్ దివస్' కార్యక్రమం నిర్వహించారు. కోటిలింగాల దేవాలయం వద్ద తెలంగాణ తల్లి విగ్రహానికి పూలమాలలు వేసి క్షీరాభిషేకం నిర్వహించారు. అనంతరం ప్రభుత్వ వైద్య కళాశాల ఆసుపత్రిలో రోగులకు పండ్లు పంపిణీ చేసి, అంబేద్కర్ విగ్రహానికి నివాళులర్పించారు.

13న జవహర్ నవోదయ విద్యాలయ ప్రవేశ పరీక్ష

- జిల్లా వ్యాప్తంగా ఏడు కేంద్రాల్లో ఏర్పాట్లు పూర్తి : డీఈవో శ్రీనివాస్‌రెడ్డి

సిద్దిపేట కల్చరల్, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): జవహర్ నవోదయ విద్యాలయ ప్రవేశ పరీక్ష నిర్వహణకు ఏర్పాట్లు పూర్తయ్యాయని, జిల్లా విద్యాశాఖ అధికారి (డీఈవో) శ్రీనివాస్ రెడ్డి తెలిపారు. 2025-26 విద్యా సంవత్సరానికి ఆరో తరగతిలో ప్రవేశానికి నిర్వహించే నవోదయ విద్యాలయ ఎంపిక పరీక్ష నిర్వహణ కోసం అబ్జర్వర్ల శిక్షణ కార్యక్రమాన్ని మంగళవారం సిద్దిపేటలోని విద్యాశాఖ కార్యాలయంలో నిర్వహించారు. ఈ సందర్భంగా డీఈవో శ్రీనివాస్‌రెడ్డి మాట్లాడారు. జిల్లా వ్యాప్తంగా ఏడు పరీక్ష కేంద్రాలు ఏర్పాటు చేసినట్లు చెప్పారు. ఈ నెల 13న (శనివారం) నిర్వహించే పరీక్ష కోసం 1739 మంది విద్యార్థులు రిజిస్టర్ చేసుకున్నారని తెలిపారు. పరీక్ష ఉదయం 11:30 గంటల నుండి మధ్యాహ్నం 1:30 గంటల వరకు కొనసాగుతుందని, పరీక్ష సెంటర్ వద్ద బందోబస్తు ఏర్పాటు చేయాలని పోలీస్ శాఖను కోరినట్లు చెప్పారు. విద్యార్థులు సకాలంలో పరీక్ష హాలుకు చేరుకోవాలని సూచించారు.



సెంటర్ లెవెల్ అబ్జర్వర్ల శిక్షణ కార్యక్రమం

జిల్లాలోని పరీక్ష కేంద్రాలు:

ప్రభుత్వ ఉన్నత పాఠశాల, పారిపల్లి వీధి, సిద్దిపేట, ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాల, చారువాడన్ స్ట్రీట్, ఆజాంపుర, సిద్దిపేట, ప్రభుత్వ ఉన్నత పాఠశాల, మెదక్ రోడ్, సిద్దిపేట. ప్రభుత్వ నూతన ఉన్నత పాఠశాల (న్యూ హైస్కూల్), కరీంనగర్ రోడ్, సిద్దిపేట. సెయింట్ మేరీస్ విద్యానికేతన్, ఎస్‌హెచ్ 17 ప్రజ్ఞాపూర్. సెయింట్ జోసెఫ్ హైస్కూల్, వాసవి నగర్, ఎస్‌హెచ్ 17 గజ్వేల్. వివేకానంద విద్యాలయం, దుబ్బాక.

నగదు పట్టివేత



నగదును పట్టుకున్న అధికారులు

మునిపల్లి, డిసెంబరు9 (ఆంధ్రజ్యోతి) : సర్పంచ్ ఎన్నికల సందర్భంగా వాహనాల తనిఖీల్లో భాగంగా రూ. లక్ష నగదును పట్టుకున్నారు. పత్రాలు లేకుండా పైసలు తీసుకెళ్తే వాటిని సీజ్ చేస్తామని మునిపల్లి ఎస్సై రాజేష్ నాయక్, ఫ్లైయింగ్ స్క్వాడ్ (ఎఫ్ఎస్‌టి) ప్రదీప్‌లు హెచ్చరించారు. సర్పంచ్ ఎన్నికల నేపథ్యంలో మంగళవారం మండలంలోని బుదేరా చౌరస్తాలో వాహనాల తనిఖీ చేస్తున్న క్రమంలో మండలంలోని పెద్దలోడి గ్రామానికి చెందిన పెద్దగొల్ల దస్సయ్య అనే వ్యక్తి కారును తనిఖీ చేశారు. అందులో ఎలాంటి పత్రాలు లేకుండా (రూ.500నోట్లు యాభై వేలు రెండు కట్టలు) రూ.లక్ష నగదును అధికారులు పట్టుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ. ఎన్నికల కోడ్ ఉన్నందున నగదు తీసుకెళ్తే వాటికి సంబంధించిన పత్రాలు తప్పని సరిగా వెంట పెట్టుకోవాలని సూచించారు. పత్రాలు లేకుండాతీసుకెళ్తే వాటిని సీజ్ చేస్తామని హెచ్చరించారు. ఈ తనిఖీలో ఆర్ఐ సుభాష్, ఎమ్మార్వో కార్యాలయ అసిస్టెంట్ శశాంక్ తదితరులు ఉన్నారు.

దంపతుల మధ్య గొడవ.. భర్త అదృశ్యం



రవి (ఫైల్)

తూప్రాన్, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): అప్పుల విషయంలో దంపతుల మధ్య గొడవ జరిగింది. దీంతో మనస్తాపంతో భర్త ఇంట్లోంచి వెళ్లిపోయాడు. ఈ సంఘటన తూప్రాన్ పట్టణంలో చోటు చేసుకుంది. తూప్రాన్ ఎస్సై శివానందం తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. మాసాయిపేట మండలం చెట్లతిమ్మాయిపల్లికి చెందిన బర్మావత్ సునీత, బర్మావత్ రవి (36) దంపతులు రెండేళ్లుగా తూప్రాన్ పట్టణంలోని వినాయకనగర్ కాలనీలో నివాసముంటున్నారు. భర్త రవి చేసిన అప్పుల విషయంలో గతనెల 20న రాత్రి దంపతుల మధ్య గొడవ జరిగింది. 21న ఉదయం 8 గంటలకు రవి పనికి వెళ్తున్నట్లు చెప్పి ఇంట్లోంచి వెళ్లాడు. రాత్రి వరకు ఇంటికి రాలేదని, రవికి ఫోన్ చేస్తే స్విచ్ఛాఫ్ వస్తుందని వివరించారు. రవి కోసం చుట్టు పక్కల బంధువుల వద్ద వెతికినప్పటికీ ఆచూకీ లభించలేదు. మంగళవారం వరకు ఆచూకీ లభించకపోవడంతో ఫిర్యాదు చేసినట్లు ఎస్సై శివానందం పేర్కొన్నారు.

షార్ట్ సర్క్యూట్‌తో ఇల్లుదగ్ధం

జహీరాబాద్, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): సంగారెడ్డి జిల్లా జహీరాబాద్ మండలంలోని అల్గోల్ గ్రామంలో మంగళవారం షార్ట్ సర్క్యూట్‌తో చాకలి లక్ష్మమ్మకు చెందిన ఇల్లుపూర్తిగా దగ్ధమైంది. స్థానికులు, బాదితులు తెలిపిన వివరాల ప్రకారం.. ఇంట్లో ఏర్పాటుచేసిన ఫ్రిజ్‌పై క్యాండిల్ ముట్టించి ఉంచడంతో అక్కడ ఉన్న దుస్తులకు, వైరుకు తగులుకుని మంటలు తగలడంతో పెద్ద ఎత్తున మంటలు ఎగిశాయి, దీంతో రేకులతో ఉన్న ఇల్లు, ఇంట్లో గల బంగారం, నగదు, వంటసామగ్రి, తదితరాలు పూర్తిగ కాలిపోయాయన్నారు. సుమారు రూ.10లక్షలకు పైగానే నస్టం వాటిల్లిందని స్థానికులు వివరించారు. తమను ఆదుకోవాలని బాధితులు కోరుతున్నారు.

చోరీ కేసులో నిందితుడి అరెస్ట్

కొమురవెల్లి, డిసెంబరు9 (ఆంధ్రజ్యోతి): కొమురవెల్లి మల్లన్న ఆలయానికి సమీపంలో గత నెల 29వ తేదిన మహిళ మెడలోంచి పుస్తెల తాడును చోరి చేసిన కేసులో నిందితుడిని పోలీసులు అరెస్ట్ చేశారు.ఈ మేరకు పోలీస్‌స్టేషన్‌లో మంగళవారం ఎస్సై టి.మహేష్ వివరాలను వెల్లడించారు. మండలకేంద్రానికి చెందిన మహిళ మెడలోంచి గత నెల 29వ తేదిన పుస్తెలతాడును అపహరించిన కేసులో ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసి తీగుళ్ల రజనీకాంత్ అనే వ్యక్తిని అరెస్ట్ చేసి చోరీ చేసిన వస్తువులను స్వాధీనం చేసుకున్నారు. నిందితుడిని కోర్టులో హాజరుపరచి రిమాండ్‌కు తరలిస్తామని పేర్కొన్నారు.

తహసీల్దారు ఎదుట పలువురి బైండోవర్

మద్దూరు , డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి) : మద్దూరు మండలంలో సర్పంచ్ ఎన్నికల్ని పురస్కరించుకుని గతంలో కేసులున్న వారిని తహసీల్దారు ఎదుట బైండోవర్ చేస్తున్నట్లు ఎస్సై షేక్ మహబూబ్ అలీ తెలిపారు. ఎన్నికల నియమావళిని ఉల్లంఘించి గొడవలు సృష్టించకుండా ఉండేందుకు సుమారు 65 మందిని ఇప్పటి వరకు బైండోవర్ చేసినట్లు తెలిపారు. ప్రజలందరు ఎన్నికల నియమావళిని పాటించి ఎన్నికలు సజావుగా జరిగేలా సహకరించాలని సూచించినట్లు తెలిపారు.

భారీగా మద్యం పట్టివేత



తూప్రాన్‌లో పట్టుబడిన మద్యం బాటిళ్లు

ములుగు/తూప్రాన్/చేగుంట/టేక్మాల్/కోహెడ/రేగోడు,డిసెంబరు 9(ఆంధ్రజ్యోతి): పంచాయతీ ఎన్నికల సందర్భంగా ఎఫ్ఎస్‌టీ టీమ్ ముమ్మరంగా వాహనాలు తనఖీ నిర్వహిస్తున్నారు. నాయకులు మద్యం అక్రమంగా తరలిస్తూ పట్టుబడుతున్నారు. ఈ క్రమంలో ఉమ్మడి జిల్లాలో పలు చోట్ల భారీగా మద్యం పట్టుకున్నారు. మంగళవారం రేగోడు మండలంలోని మార్పల్లి గ్రామ రహదారులపై వాహనాల తనిఖీలు నిర్వహించగా బైక్‌పై తీసుకెళ్తున్న 73 మద్యం బాటిళ్లను పట్టుకున్నారని ఆర్ఐ విజయలక్ష్మి తెలిపారు. పట్టుకున్న మద్యాన్ని స్థానిక పోలీస్ స్టేషన్‌లో అప్పగించామని తెలిపారు.

ములుగు : మండల కేంద్రమైన ములుగులో ఉదయం 4:30 నిమిషముల సమయంలో గ్రామ శివారులోని శ్యామ్‌సుందర్‌రెడ్డి వ్యవసాయ పొలం వద్ద గజ్వేల్ రూరల్ సీఐ మహేందర్‌రెడ్డి, ములుగు ఎస్సై రఘుపతి సిబ్బందితో కలిసి తనిఖీ చేయగా పలు రకాల మద్యం బాటిళ్లు లభించాయి. మొత్తం 673లీటర్ల(మద్యం విలువ 7,40,520) మద్యం బాటిళ్లు స్వాధీనం పరుచుకొని కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ మహేందర్‌రెడ్డి తెలిపారు.

తూప్రాన్ : తూప్రాన్ మండలంలో అక్రమంగా తరలిస్తున్న మద్యం బాటిళ్లు పట్టుకున్నట్లు ఫ్లయింగ్ స్క్వాడ్ టీమ్ ఇన్‌చార్జి, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ ప్రేమ్‌కుమార్ తెలిపారు. తనిఖీల్లో సుమారు రూ. 70వేల విలువైన 9 కాటన్ల మద్యం బాటిళ్లు పట్టుకున్నట్లు పేర్కొన్నారు. పట్టుబడిన మద్యం కాటన్లు పోలీసులకు అప్పగించి ఫిర్యాదు చేసినట్లు ప్రేమ్‌కుమార్ తెలిపారు.

చేగుంట : నార్సింగ్ శివారులోని నర్సంపల్లి, మిర్జాపల్లి రహదారుల్లో వాహనాలను తనిఖీ చేస్తుండగా నర్సంపల్లి ఆటోలో తరలిస్తున్న ఐబీ విస్కీ కాటన్, ఒక బీర్ కాటన్, మిర్జాపల్లి రహదారిలో కారులో తరలిస్తున్న రెండు ఐబి విస్కీ కాటన్‌లు, మూడు మ్యాక్డోల్ విస్కీ కాటన్‌లు పట్టుకొని పోలీసులకు అప్పగించినట్లు ఎఫ్ఎస్‌టీ అధికారులు శ్రీధర్ తెలిపారు.

టేక్మాల్ : టేక్మాల్ మండల కేంద్రంలో తొమ్మిది మంది వద్ద నుంచి 122 లీటర్ల మద్యం బాటిళ్లను పట్టుకున్నారు. వాటి విలువ 70వేలు ఖరీదు ఉంటుందని తరలించిన వాహనాలు స్వాధీనం చేసుకున్నామని ఎస్సై అరవింద్ తెలిపారు. ఓటర్లకు ప్రలోభపెట్టడానికి కొందరు మద్యం పంపిణీ చేయడానికి ప్రయత్నిస్తున్నారన్న సమాచారం మేరకు ఈ దాడులు నిర్వహించామని తెలిపారు. ఈ క్రమంలో అక్రమంగా తరలిస్తున్న మద్యాన్ని సీజ్ చేసి వారిపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ అరవింద్ తెలిపారు.

మద్యం నిల్వచేసిన ఇద్దరిపై కేసు నమోదు

కోహెడ : కోహెడ మండలం వెంకటేశ్వరపల్లి గ్రామ పరిధిలోని షేర్ హాలీనగర్‌లో అక్రమంగా మద్యం నిల్వచేసిన ఇద్దరు వ్యక్తులపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై పి. అభిలాష్ తెలిపారు. ఎస్సై కథనం ప్రకారం.. షేర్‌అలీనగర్ చెందిన షేక్ షరీఫ్, షేక్ అక్బర్ అనే ఇద్దరి ఇళ్లల్లో ఎన్నికల కోసం మద్యం నిలువ చేసినట్లు సమాచారం వచ్చిందన్నారు. ఈ మేరకు పోలీసులతో తనిఖీ చేశామన్నారు. ఎన్నికల నియమావళికి విరుద్ధంగా మద్యం నిల్వ చేయడంతో వారిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు చెప్పారు. ఏ ఒక్కరు కూడా ఎన్నికల నియమావళిని ఉల్లంఘించిన వారిపై చట్టరీత్యా చర్యలు తీసుకోవడం జరుగుతుందని హెచ్చరించారు.

ఆటోను ఢీకొన్న ఎన్నికల పరిశీలకుడి కారు

● ఆటో వెళ్లి మహిళను ఢీ.. మహిళా కూలీ మృతి



ప్రమాదానికి కారణమైన కారు



గుని సత్తెమ్మ (ఫైల్)

చేగుంట, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): గ్రామ పంచాయతీ ఎన్నికల పరిశీలకుడి కారు వేగంగా వచ్చి ఆటోను ఢీ కొట్టగా.. ఆ ఆటో వెళ్లి రహదారిపై పనులు చేస్తున్న మహిళా కూలిని ఢీ కొట్టడంతో ఆమె అక్కడిక్కడే మృతి చెందింది. ఈ ఘటన మెదక్ జిల్లా నార్సింగ్ మండలం వల్లూరు 44వ జాతీయ రహదారిపై మంగళవారం జరిగింది. పోలీసుల కథనం ప్రకారం.. చేగుంట మండలం వడియారం గ్రామానికి చెందిన గూని సత్తెమ్మ (40) రోజు మాదిరిగానే మంగళవారం జాతీయ రహదారి (జీఎంఆర్ సంస్థ) కాంట్రాక్టర్ వద్ద రోడ్డు డివైడర్ పై పూల మొక్కలల్లో గడ్డి తొలగించేందుకు కూలి పనులకు వెళ్లింది. డివైడర్ వద్ద చెత్తను గడ్డి తొలగించే క్రమంలో హైదరాబాద్ నుంచి నిజామాబాద్ వైపు అతివేగంగా వెళ్తున్న నిర్మల్ జిల్లా గ్రామ పంచాయతీ ఎన్నికల సాధారణ అబ్జర్వర్ ప్రయాణిస్తున్న కారు ముందు వెళ్తున్న ఆటోను వెనుక నుంచి ఢీ కొట్టింది. ఈ క్రమంలో ఆటో రోడ్డు పక్కన పని చేస్తున్న గుని సత్తెమ్మను ఢీ కొట్టడంతో ఆమె కాలువలో పడి అక్కడికక్కడే మృతి చెందింది. ఆటోలో ఉన్న డ్రైవర్‌కు పలువురికి స్వల్ప గాయాలయ్యాయి. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం రామాయంపేట ఆసుపత్రికి తరలించారు. మృతురాలు సత్తెమ్మ కుమారుడు సురేష్ ఫిర్యాదు మేరకు నార్సింగ్ ఎస్ఐ సృజన కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు. కారు డ్రైవర్ పరారీలో ఉన్నాడు.

విధులకు ఎన్‌హెచ్‌ఎం ఉద్యోగులు దూరం

● మూడు నెలల వేతన బకాయిలు పెండింగ్

● జీతాలిచ్చే వరకు నల్లబ్యాడ్జీలతో నిరసన

సంగారెడ్డి అర్బన్, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): వైద్య ఆరోగ్య శాఖ పరిధిలోని జాతీయ ఆరోగ్య మిషన్(ఎన్‌హెచ్‌ఎం)పథకం కింద పనిచేస్తున్న వైద్య ఉద్యోగులు, సిబ్బంది ఈ నెల 11 వ తేదీ నుంచి అన్ని రకాల సేవలు నిలిపివేయడంతో పాటు విధులకు దూరంగా ఉండనున్నట్లు ప్రకటించారు. సెప్టెంబరు, అక్టోబరు, నవంబరు ఇలా మూడు నెలల వేతన బకాయిలు ప్రభుత్వం ఇప్పటి వరకు చెల్లించకపోవడంతో ఈ నిర్ణయం తీసుకున్నట్టు ఉద్యోగులు తెలిపారు. వేతనాలు విడుదల చేసే వరకు నల్ల బ్యాడ్జీలు ధరించి నిరసన తెలపనున్నట్టు పేర్కొన్నారు. ఇదే విషయమై మంగళవారం ఎన్‌హెచ్‌ఎం కాంట్రాక్టు, ఔట్ సోర్సింగ్ ఎంప్లాయిస్ యూనియన్ ఆధ్వర్యంలో సంగారెడ్డి డీఎంహెచ్‌వో డా.వసంతరావుకు వినతి పత్రం సమర్పించారు. ప్రభుత్వం తక్షణమే స్పందించి పెండింగ్ వేతనాలు విడుదల చేయాలని, అదే విధంగా ప్రతి నెలా సమయానికి వేతనాలు చెల్లించేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని ఉద్యోగులు కోరారు.



సంగారెడ్డిలో పోస్టాఫీస్ కార్యాలయంలో ఉత్తరాలు చూపుతున్న ప్రజా సంఘాల నాయకులు

ఈవీఎం టాంపరింగ్‌పై దేశవ్యాప్త ఉద్యమం

సంగారెడ్డి రూరల్, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): ఈవీఎం టాంపరింగ్‌పై దేశవ్యాప్త ఉద్యమం చేపట్టేందుకు సిద్ధంగా ఉండాలని నేటివ్ ఇండియా ఫోరం జాతీయ అధ్యక్షుడు బీరయ్య యాదవ్ పిలుపునిచ్చారు. సంగారెడ్డిలో పోస్టాపీస్ కార్యాలయంలో మంగళవారం ప్రజా సంఘాల నాయకులు సుప్రీం కోర్టు న్యాయమూర్తికి ఉత్తరాలు రాసి స్పీడ్ పోస్ట్ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. బీహార్ ఎన్నికల ఫలితాలు పలు అనుమానాలకు తావిస్తున్న నేపథ్యంలో ఈవీఎంలను ఫోరెన్సిక్ పరీక్ష చేసి దోషులను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. పాత బ్యాలెట్ పద్ధతిలో పరీక్షలు నిర్వహించాలన్నారు.

తాళం వేసి ఉన్న ఇంట్లో చోరీ

కల్హేర్, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): సంగారెడ్డి జిల్లా నిజాంపేట మండల పరిధిలోని బాచేపల్లి గ్రామంలో తాళం వేసిన ఇంట్లోకి చొరబడిన దొంగలు చోరీ చేసినట్లు కల్హేర్ ఎస్సై రవిగౌడ్ మంగళవారం తెలిపారు. గ్రామానికి చెందిన నోముల సునీత అనే మహిళ తన తల్లి గారి గ్రామమైన కల్హేర్ మండలంలోని మాసాన్‌పల్లి గ్రామానికి జాతర ఉత్సవాలకు వెళ్లగా సోమవారం రాత్రి గుర్తు తెలియని వ్యక్తులు తాళం పగుల గొట్టి ఇంట్లోకి చొరబడి బీరువా ధ్వంసం చేసి అందులోని తులం బంగారు వస్తువులు, 24 తులాల వెండి నగలు దొంగిలించిన్లు ఆయన తెలిపారు. సునీత ఇంటి ముందు వీరశెట్టి అనే వ్యక్తి తన బైకు నిలుపగా బైకును కూడా చోరీ చేసినట్లు ఎస్సై తెలిపారు. గ్రామ శివారులోని పట్లోళ్ల వెంకట్ రెడ్డి సిమెంటు దుకాణం షటర్ ధ్వంసం చేసి అందులో ఉన్న నగదు కూడా దొంగిలించారు. బాధితురాలు సునీత ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు జరుపుచునంనట్లు ఎస్సై రవిగౌడ్ తెలిపారు.



నిజాంపేట మండల బాచేపల్లిలో చోరీ జరిగిన ఇంటిని పరిశీలిస్తున్న ఎస్సై

కార్మికులను బానిసలుగా మార్చే కుట్ర

- మతోన్మాదంతో వారిని విడదీయాలని చూస్తున్నారు
- సీఐటీయూ రాష్ట్ర మహాసభల్లో ఎం. సాయిబాబా
- రాష్ట్ర కార్యవర్గం ఎంపిక



వేదికపై ప్రసంగిస్తున్న సీఐటీయూ అఖిల భారత కమిటీ కోశాధికారి ఎం. సాయిబాబా

మెదక్ కల్చరల్, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వం కార్మిక సంఘాలను బలహీన పరిచి, పెట్టుబడిదారులకు, కార్పొరేట్ యాజమాన్యాలకు లాభాలు చేకూర్చేవిధంగా వ్యవహరిస్తోందని సీఐటీయూ అఖిల భారత కమిటీ కోశాధికారి ఎం. సాయిబాబా ఆరోపించారు. నాలుగు లేబర్ కోడ్లను అమలు చేసేందుకు నిర్ణయించి, కార్మికులను మధ్య యుగాల నాటి బానిసలుగా మార్చేందుకు కుట్ర చేస్తున్నదని మండిపడ్డారు. సీఐటీయూ రాష్ట్ర ఐదో మహాసభలు మెదక్ పట్టణంలో మూడు రోజులుగా జరుగుతున్నాయి. మంగళవారం జరిగిన ముగింపు సభలో ఎం. సాయిబాబా మాట్లాడారు. కార్పొరేట్ మతోన్మాద ప్రభుత్వం రాజ్యాంగ హక్కులు, ప్రజాస్వామిక విలువలను ఉల్లంఘిస్తూ శ్రమశక్తి నీతి -2025 పేరుతో కొత్త కార్మిక విధానాన్ని తీసుకురాబోతున్నదని తెలిపారు. బహిరంగంగా మనుధర్మ శాస్త్రమని ప్రకటించటం ఆందోళనకరమన్నారు. రాజ్యాంగం కల్పించిన సమానత సూత్రాలకు తిలోదకాలిస్తూ రాజధర్మ, మనుధర్మం పేరుతో కుల, మత విభజనలతో కార్మిక వర్గ పోరాటాలను బలహీన పర్చే ఆర్ఎస్ఎస్, బీజేపీ కుట్రలను కార్మిక వర్గం ఆమోదించబోదని, తీవ్ర ప్రతిఘటనను అడ్డుకుంటున్నారు. ఈ చట్టాల వల్ల జరగబోయే ప్రమాదాలను తెలియజేస్తూ ఫిబ్రవరిలో ప్రత్యక్ష పోరాటానికి కార్మిక వర్గాన్ని సన్నద్ధం చేస్తున్నామని తెలిపారు. ఇప్పటికే అన్ని కార్మిక సంఘా ఐక్య జాతీయ వేదిక ఢిల్లీలో సమావేశమై కార్యాచరణ రూపొందించనున్నట్టు తెలిపారు. రాజ్యాంగం ఉమ్మడి జాబితాలో ఉన్న కార్మిక చట్టాల రూపకల్పనను రాష్ట్ర ప్రభుత్వాలతో చర్చించకుండా అమలుకు పూనుకోవటం తీవ్ర అనర్థాలకు దారి తీస్తుందని, వీటిని అమలు చేయబోమని ప్రకటించిన కేరళ ప్రభుత్వాన్ని అభినందించారు. ఇదే దారిలో తెలంగాణ రేవంత్ రెడ్డి ప్రభుత్వం చర్య తీసుకోవాలని డిమాండ్ చేశారు. సీఐటీయూ అఖిల భారత అధ్యక్షురాలు డాక్టర్ హేమలత మాట్లాడుతూ పాలక వర్గాలు కార్మికవర్గానికి నష్టం చేసే చర్యలు తీసుకుంటున్నాయని, వీటికి వ్యతిరేకంగా పోరాటాలను మరింత ఉధృతిని పెంచాలని సూచించారు.

శ్రమకశక్తి నీతిని ఉపసంహరించాలి


ఈ సభల్లో పలు తీర్మానాలను రాష్ట్ర కార్యదర్శి వీఎస్ రావు, ముత్యంరావు ఆధ్వర్యంలో ప్రవేశపెట్టారు. ఇందులో పాలకులు శ్రమకశక్తి నీతి - 2025 ను వెంటనే ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. ఆ పేరుతో మోదీ ప్రభుత్వం కార్మిక ముసాయిదాను ప్రకటించిందని తెలిపారు. కార్మిక చట్టాల అమలు, తనిఖీలు, యాజమాన్యాలకు, కార్మిక సంఘాలకు మధ్య మధ్యవర్తిత్వం వహించటం ద్వారా రాజీలు కుదర్చటం, తీర్పులివ్వటం వంటి పద్ధతులతో వివాదాలు పరిష్కరించే బాధ్యత కార్మిక శాఖదని తెలిపారు. కానీ, ఇప్పుడు ఆ శాఖను యాజమాన్యపు శాఖగా మార్చనుందని పేర్కొన్నారు. మొత్తం 39 తీర్మానాలను ఆమోదించించారు.

నూతన కార్యవర్గం ఎన్నిక....

సీఐటీయూ రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులుగా చుక్క రాములు, పాలడుగు భాస్కర్, కోశాధికారిగా వంగూరు రాములు తిరిగి ఎన్నికయ్యారు. 31 మందితో ఆఫీసు బేరర్లను ఎన్నుకొన్నారు. ఇందులో ఉపాధ్యక్షులుగా ఎస్ వీరయ్య, ఆర్. సుధాభాస్కర్, భూపాల్, ఎస్వీ రమ, కళ్యాణం వెంకటేశ్వర రావు, టి. వీరారెడ్డి, పి జయలక్ష్మి, జె మల్లిఖార్జున్, వీఎస్ రావు, కె ఈశ్వరరావు, టి. రాజారెడ్డి, ఆర్ త్రివేణి, కార్యదర్శులుగా జె. వెంకటేశ్, ఏ. ముత్యంరావు, బి. మధు, జె. చంద్రశేఖర్, బి. మల్లేశ్, ఎం. పద్మశ్రీ, కూరపాటి రమేష్, పి. శ్రీకాంత్, ఎం. వెంకటేశ్, ఏజే. రమేష్, రాగుల రమేష్, కె. గోపాల స్వామి, కాసు మాధవి, పి. సుధాకర్, జి. కవితలతో పాటు 109 మంది రాష్ట్ర కౌన్సిల్, 103 వర్కింగ్ కమిటీ సభ్యులను ఎన్నుకున్నారు.

ఒకే కుటుంబం.. మూడు దశాబ్దాలుగా బరిలో..

- కిష్టాపూర్‌లో ఆరోసారి బరిలో నిలిచిన చుక్క కిషన్ కుటుంబం



చుక్క కిషన్ భార్య, కొడుకు, కోడలు



చుక్క కిషన్

తూప్రాన్, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): గ్రామ పంచాయతీ ఏర్పడిన నాలుగున్నర దశాబ్దాల కాలంలో ఏడు పర్యాయాలు ఎన్నికలు జరిగాయి. ఇందులో 1995 నుంచి ఒకే కుటుంబం ఐదు పర్యాయాలు పోటీ చేయగా, ఆరో పర్యాయం మళ్లీ పోటీకి నిలిచింది. ఇందులో రెండు పర్యాయాలు సర్పంచ్‌గా గెలుపొందారు. ఈ విచిత్ర పరిస్థితి మెదక్ జిల్లా తూప్రాన్ మండలం కిష్టాపూర్ గ్రామ పంచాయతీలో చోటు చేసుకుంది. కిష్టాపూర్ గ్రామం గ్రామ పంచాయతీగా 1979లోలో ఏర్పడింది. అప్పటి నుంచి 1988 వరకు వంజరి కిష్టయ్య సర్పంచ్‌గా పనిచేయగా, 1988 జరిగిన ఎన్నికల్లో మాచిరెడ్డి కిష్టారెడ్డి గెలుపొందాడు. అనంతరం 1995లో జరిగిన ఎన్నికల్లో చుక్క కిషన్ పోటీ చేసి విజయం సాధించారు. 2000లో జరిగిన ఎన్నికల్లో చుక్క కిషన్ తన భార్య చంద్రకళను పోటీలో నిలపగా ఓటమి చెందారు. 2007లో జరిగిన ఎన్నికల్లో చుక్క కిషన్ మళ్లీ సర్పంచ్‌గా గెలుపొందారు. అయితే 2011లో ఆయన అనారోగ్యంతో మృతిచెందారు. 2012 జరిగిన ఎన్నికల్లో చుక్క కిషన్ కోడలు చుక్క హిమబిందు పోటీ చేసి ఓటమి చెందారు. 2018 లో జరిగిన ఎన్నికల్లో చుక్క కిషన్ కొడుకు పోటీ చేసి ఓటమి చెందాడు. మళ్లీ రిజర్వేషన్ అనుకూలించడంతో, ప్రస్తుతం జరుగుతున్న గ్రామ పంచాయతీ ఎన్నికల్లో చుక్క కిషన్ కోడలు హిమబిందు (చుక్క శ్రీశైలం భార్య) మరోసారి పోటీ చేస్తున్నారు.



ఎమ్మెల్యే స్వగ్రామంలో ఏడుగురు అభ్యర్థులు

- ఆసక్తికరంగా మారిన బోరంచ రాజకీయం

మనూరు, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): నారాయణఖేడ్ ఎమ్మెల్యే పట్లోళ్ల సంజీవరెడ్డి స్వగ్రామమైన మనూరు మండలం బోరంచలో ఏడుగురు అభ్యర్థులు సర్పంచ్ బరిలో ఉండటంతో రాజకీయం ఆసక్తికరంగా మారింది. సర్పంచ్ కోసం 16 మంది నామినేషన్లు దాఖలు చేశారు. కొంతమంది ఉపసంహరించుకోగా, ఏడుగురు అభ్యర్థులు పోటీలో నిలిచారు. గత ఎన్నికల్లో ఈ గ్రామం నుంచి సర్పంచ్ పదవి కోసం ముగ్గురు అభ్యర్థులు మాత్రమే పోటీలో ఉండగా, బీఆర్ఎస్ మద్దతుదారుడు సర్పంచ్‌గా గెలుపొందారు. గత ఎన్నికల్లో ఈ పంచాయతీ బీసీ రిజర్వేషన్ కాగా, ఈ సంవత్సరం మాత్రం జరిగే పంచాయతీ ఎన్నికల్లో జనరల్ రిజర్వు కావడంతో పోటీ చేయడానికి అందరూ ఆసక్తి చూపుతున్నారు. ఈసారి ఏడుగురు అభ్యర్థులు పోటీలో ఉండగా, బీఆర్ఎస్ మద్దతుతో ఇద్దరు, కాంగ్రెస్ మద్దతుతో ఇద్దరు, మరో ముగ్గురు స్వతంత్ర అభ్యర్థులు పోటీ చేస్తున్నారు. బోరంచలో 2124 ఓట్లు ఉండగా, ఈ నెల 17ననననననన పోలింగ్ జరుగనున్నది.

గతంలో కళకళ .. నేడు కనుమరుగు

- మాయమైన గుడాటిపల్లి



గుడాటిపల్లి గ్రామ పంచాయతీ

హుస్నాబాద్, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): గత పంచాయతీ ఎన్నికల్లో కళకళలాడిన పల్లె నేడు కనిపించకుండా పోయింది. ఆ పల్లె పేరు కూడా మాయమైంది. అదే అక్కన్నపేట మండలంలోని గుడాటిపల్లి. గౌరవెల్లి రిజర్వాయర్ ముంపు గ్రామం అయిన గుడాటిపల్లి గ్రామ పంచాయతీ పరిధిలో తెనుగుపల్లి, చౌళ్లపల్లి, మద్దెలపల్లి, కొత్తపల్లి, సోమాజితండా, బొంద్యానాయక్ తండా, సేవానాయక్ తండా, జాలుబాయి తండా, చింతల తండాలుండగా దాదాపు 2400 మంది ఓటర్లు ఉండేవారు. గౌరవెల్లి రిజర్వాయర్‌లో నీటిని నింపేందుకు 2023 మే 10వ తేదీన గుడాటిపల్లి ప్రజలను ఖాళీ చేయించారు. ప్రస్తుతం ఈ పల్లె వాసులు సవాలాల్ మహారాజ్ తండా, హుస్నాబాద్, పోతారం (ఎస్), గౌరవెల్లి, కూచనపల్లి క్రాసింగ్, చిగురుమామిడి మండలం కూచనపల్లి, రేగొండ గ్రామాల్లో ఇళ్లు నిర్మించుకుని నివాసం ఉంటున్నారు. ఈ పంచాయతీ ఎన్నికల సమయంలో చెట్టుకొకరు పుట్టకొకరమై మా గుడాటిపల్లి పల్లె పేరు లేకుండా పోయిందని ఆ పల్లె ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

ఊరు చిన్నది... పోరు పెద్దది

- నాగాపూర్‌లో 880 ఓట్లు.. ఏడుగురు సర్పంచ్ అభ్యర్థులు

సంగారెడ్డి రూరల్, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): సంగారెడ్డి మండలంలోనే ఆ గ్రామం చిన్నది. కానీ సర్పంచ్ పదవికి మాత్రం భారీగా పోటీ నెలకొంది. మేజర్ గ్రామ పంచాయతీలలో సైతం ముగ్గురు నుంచి నలుగురు అభ్యర్థులు పోటీలో ఉంటేనే ఎక్కువ అనుకుంటారు. కానీ మండల పరిధిలోని నాగాపూర్ గ్రామ పంచాయతీలో కేవలం 1200 జనాభా, 880 ఓటర్లు మాత్రమే ఉన్నా, సర్పంచ్ పదవికి ఏడుగురు అభ్యర్థులు బరిలో నిలిచారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో జనరల్ రిజర్వేషన్ రావడంతో ఆశావహులు పెరిగిపోయారు. సర్పంచ్ అభ్యర్థులుగా తాజా మాజీ సర్పంచ్ కటకం రాజు, మాజీ సర్పంచ్ అశోక్ గౌడ్, నాగరాజు గౌడ్, హన్మంతు, గొల్ల దశరథ్, చింతల బాలరాజు, విజయేందర్‌రెడ్డి మొత్తం ఏడుగురు పోటీలో నిలిచారు. ఓటర్లు ఎవరికి పట్టం కడతారో తెలియాలంటే డిసెంబరు 11వ తేదీ వరకు వేచి చూడాల్సిందే.

మళ్లీ పాత ప్రత్యర్థులే...

కల్హేర్, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని రాపర్తి గ్రామ పంచాయతీలో 2019 గ్రామ పంచాయతీ ఎన్నికల్లో సర్పంచ్ పదవికి పోటీ చేసిన వ్యక్తులే మరోసారి బరిలోకి దిగుతుండటం విశేషం. బీఆర్ఎస్ పార్టీ మద్దతుతో మంద శ్రవణ్‌కుమార్, కాంగ్రెస్ పార్టీ మద్దతుతో ఎర్ర రవి 2019లో పోటీ చేయగా, 273 ఓట్ల మెజారిటీతో మంద శ్రవణ్‌కుమార్ విజయం సాధించారు. తిరిగి ఈ ఇద్దరూ అవే పార్టీల మద్దతుతో బరిలోకి దిగుతున్నారు. మంగళవారం నామినేషన్ల ఉపసంహరణ అనంతరం వీరితో కలిపి రాపర్తి పంచాయతీలో ఐదుగురు అభ్యర్థులు పోటీలో మిగిలారు.

మూడు సార్లు సర్పంచ్.. ప్రస్తుతం వార్డు సభ్యుడిగా పోటీ

హుస్నాబాద్, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి) : అక్కన్నపేట మండలానికి చెందిన ఓ గ్రామంలో మూడు మార్లు సర్పంచ్‌గా గెలుపొందిన వ్యక్తి ప్రస్తుతం వార్డు సభ్యునిగా పోటీ చేస్తున్నారు. 2001 నుంచి 2013 వరకు ఆయన సర్పంచ్‌గా ఉండగా 2019లో ఆయన భార్య కూడా సర్పంచ్‌గా గెలుపొందింది. ప్రస్తుతం ఆయన ఆ గ్రామంలో వార్డు సభ్యునిగా పోటీ చేస్తుండటంపై సర్వత్రా ఆసక్తి ఏర్పడింది. వార్డు సభ్యునిగా పోటీ చేయడానికి ఉప సర్పంచ్ పదవి కోసమేనని తెలుస్తుంది. ఆయనకు ప్రత్యర్థిగా మాజీ ఉప సర్పంచ్ బరిలో ఉన్నారు.

మూడో విడతలో ఏకగ్రీవాల జోరు

- నారాయణ ఖేడ్ డివిజన్‌లో ఏకంగా 24 గ్రామ పంచాయతీలు ఏకగ్రీవం

నారాయణఖేడ్/నాగల్‌గిద్ద/సిర్గాపూర్/కల్హేర్/కంగ్టి/కోహెడ/వెల్దుర్తి/మాసాయిపేట/హుస్నాబాద్ రూరల్ /కౌడిపల్లి /చిలప్‌చెడ్ / శివ్వంపేట /అక్కన్నపేట, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): నారాయణఖేడ్ డివిజన్ పరిధిలోని మొత్తం 196 గ్రామ పంచాయతీలలో, నామినేషన్ల ఉపసంహరణ ప్రక్రియ మంగళవారం ముగిసింది. పలువురు అభ్యర్థులు తమ నామినేషన్లను ఉపసంహరించుకోవడంతో డివిజన్‌లో 24 గ్రామ పంచాయతీలలో సర్పంచ్‌లు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. మండలాలవారీగా పరిశీలిస్తే నారాయణఖేడ్‌లో 7, సిర్గాపూర్‌లో 7, నాగల్‌గిద్దలో 4, నిజాంపేటలో 3, కంగ్టిలో 2, కల్హేర్‌లో ఒకటి పంచాయతీలు ఏకగ్రీవమయ్యాయి. కోహెడ మండలంలోని 27 గ్రామ పంచాయతీలకు గాను, రెండు గ్రామాలలో ఇద్దరు సర్పంచ్‌లు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. వెల్దుర్తి మండలంలో ఉన్న 23 గ్రామ పంచాయతీలలో నాలుగు ఏకగ్రీమయ్యాయిమిగిలిన 19 పంచాయతీలలో సర్పంచ్ పదవికి 70 మంది అభ్యర్థులు, 200 వార్డులలో 38 వార్డులు ఏకగ్రీవం కాగా, మిగిలిన వాటికి 400 మంది అభ్యర్థులు పోటీలో ఉన్నారు.మాసాయిపేట మండలంలోని 13 గ్రామ పంచాయతీలకు గాను ఒక సర్పంచ్, 24 వార్డు సభ్యులు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. హుస్నాబాద్ మండలంలో మూడు గ్రామ పంచాయతీలలో సర్పంచ్ అభ్యర్థులు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. కౌడిపల్లి మండలంలో మొత్తం 35 గ్రామ పంచాయతీలకు గాను ఏడు గ్రామ పంచాయతీలు ఏకగ్రీవమయ్యాయి. చిలప్‌చెడ్‌లో మండలం పరిధిలోని రాందాసుగూడా, రహీంగూడా గ్రామాలు ఏకగ్రీవమైనట్లు ఎంపీడీవో ప్రవీణ్ పేర్కొన్నారు. శివ్వంపేట మండలంలోని 37 గ్రామ పంచాయతీలకు గాను మూడు గ్రామ పంచాయతీల సర్పంచులు, వార్డు సభ్యులు ఏకగ్రీవమయ్యారు. అక్కన్నపేట మండలంలో 38 గ్రామపంచాయతీలకు గాను ఆరు గ్రామపంచాయతీలు ఏకగ్రీవమయ్యాయి.

ఏకగ్రీవంగా ఎన్నికైన సర్పంచ్‌లు మండలాలవారీగా..

నారాయణఖేడ్
అల్లాపూర్ - కమలానాయక్
శేరితండా - హీరామన్
వీర్ల తండా - సాలిబాయి
డీఎస్‌టీ తండా - కర్ర కమిలిబాయి
గుండుతండా - మేఘావత్ మౌనిక
పలుగుతండా - కిషన్‌నాయక్
కిషన్ నాయక్ తండా - సునీత చౌహాన్

- **నాగల్‌గిద్ద**
కేశ్వార్ - ముంగే మహాదేవి
గంగారాంతండా - రాథోడ్ రేణుక
కొండానాయక్ తండా - అశోక్ చౌహాన్
రత్ననాయక్ తండా - జైపాల్‌రాథోడ్

- **కల్హేర్**
జమ్లాతండా - గోవింద్‌నాయక్

- **కంగ్టి**
చందర్‌తండా - శాంతాబాయి
జీర్గి తండా - రాథోడ్ యమునాబాయి

- **నిజాంపేట**
బల్కంచెల్క తండా - మూడ్ సరిత
నాగన్‌కుంట తండా - దేవసోత సాలిబాయి
మాణిక్ తండా - మంజూల చౌహాన్

- **సిర్గాపూర్**
లక్ష్మణ్‌నాయక్ తండా - దూరిబాయి
ఫత్తెనాయక్ తండా - మంగ్లాబాయి
కిషన్ నాయక్ తండా - శిరీషరాథోడ్
వంగ్దల్ గైర్హాన్‌తండా - మోహన్
చందర్‌నాయక్ తండా - రుక్మిణీబాయి
వాసర్ తండా - మంజూల
సిర్గాపూర్ గైర్హాన్ తండా - వినోద్

- **కోహెడ**
విజయనగర్ కాలనీ - అమూల్య రాజశేఖర్ రెడ్డి
నకిరేకొమ్ముల-బుర్ర కళ్యాణి మహేష్

- **వెల్దుర్తి**
శంశిరెడ్డిపల్లి - బానోత్ గణేష్
చర్లపల్లి - అంబడి అరుణ
మంగళపర్తి - బాలయ్యగారి సంధ్య
బస్వాపూర్ - నజ్మా సుల్తానా

- **మాసాయిపేట**
నాగసాన్నిపల్లి - మంతూరి ఆంజనేయులు

- **హుస్నాబాద్**
రాములపల్లి - కాటం స్వప్న
వంగరామయ్యపల్లి - భూక్య రాజేశ్వరి
తోటపల్లి - బంక లక్ష్మి

- **కౌడిపల్లి**
శేరితండా -గణేష్
హరిచంద్రతండా - రవీందర్ నాయక్
కుష్నగడ్డ తండా - రాజు నాయక్
మర్రిచెట్టుతండా - రమేష్ నాయక్
పీరియతండా - రవళిక రమేష్ నాయక్
ధర్మా సార్ గేట్ తండా - సంధ్య
కన్నారం - కోడూరి రాములు

- **శివ్వంపేట**
తాళ్లపల్లితండా- ధనావత్ లక్ష్మిగేమ్‌సింగ్ నాయక్
మల్లుపల్లి తండా - కేతావత్ నరేష్
టిక్యాదేవమ్మగూడెం - తేజస్వినిరాజేందర్‌నాయక్

- **అక్కన్నపేట**
కెప్టెన్‌చౌడుతండా - గుగులోతు స్వరూప
గొల్లపల్లి - గుడాల లావణ్య
శ్రీరామ్‌తండా - బానోతు వెంకటేష్
కుందనవానిపల్లి -పొన్నాల వెంకవ్వ
దాసుతండా - గుగులోతు పుమీ
దుబ్బతండా - గుగులోతు శీల

కండువా మార్చి.. ఏకగ్రీవంగా ఎన్నికై..



హుస్నాబాద్, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): హుస్నాబాద్ మండలంలోని ఓ గ్రామ పంచాయతీలో సర్పంచ్ అభ్యర్థి కండువా (పార్టీ) మార్చి ఏకగ్రీవంగా ఎన్నికయ్యాడు. ఆ గ్రామం బీసీ మహిళలకు రిజర్వేషన్ అయ్యింది. బీఆర్ఎస్ గ్రామ శాఖ అధ్యక్షుడు తన భార్యతో నామినేషన్ వేయించారు. మరో ముగ్గురు కాంగ్రెస్ పార్టీకి చెందిన మహిళలు, ఒక బీజేపీకి చెందిన మహిళ కూడా నామినేషన్లు వేశారు. తన భార్యను ఏకగ్రీవం చేస్తే నేను కాంగ్రెస్ పార్టీలోకి వస్తాను అని బీఆర్ఎస్ నాయకుడు చెప్పడంతో, ముగ్గురు కాంగ్రెస్ అభ్యర్థులతో పాటు బీజేపీ అభ్యర్థి తమ నామినేషన్లను ఉపసంహరించుకున్నారు. దీంతో సదరు నాయకుని భార్య ఏకగ్రీవం కాగా, వెంటనే ఆయన కాంగ్రెస్ పార్టీ కండువా కప్పుకున్నారు.

సంక్షిప్తం

కథా రచనలో కట్టోజు నీరజ ప్రతిభ



సిద్దిపేట కల్చరల్, డిసెంబరు 9 (ఆంధ్ర జ్యోతి): బాలచెలిమి మాస పత్రిక, చిల్డ్రన్ ఎడ్యుకేషనల్ ట్రస్టు సంయుక్తంగా యువతరం విద్యార్థులకు నిర్వహించిన జాతీయ కథారచన పోటీల్లో సిద్దిపేట ప్రభుత్వ డిగ్రీకళాశాల విద్యార్థిని కట్టోజు నీరజ మొదటి స్థానంలో నిలిచింది. పర్యావరణ దృక్పథం, మానవీయ విలువలు అనే అంశాలను నేపథ్యంగా తీసుకుని, పరస్పర ఆదానప్రదానాలను జమిలిగా అక్షరీకరణ చేసిన చెట్టు ఉపకారం అనే కథ మొదటి బహుమతికి ఎంపికయింది. యువతరం ప్రత్యేక కథల సంకలనంలో నీరజ కథతో పాటు కళాశాలకు చెందిన మరో 12 మంది విద్యార్థుల కథలు ముద్రణకు స్వీకరించారు. ఈ సందర్భంగా విజేత నీరజను, ముద్రణార్హత పొందిన ఇతర యువ కథకులను కళాశాల ప్రిన్సిపాల్ డా. జి. సునీత, తెలుగుశాఖ అధ్యక్షుడు డా. మట్టా సంపత్ కుమార్ రెడ్డి అభినందించారు. అలాగే కథారచన మెలకువలతో విద్యార్థులకు అవసరమైన ప్రేరణ కలిగించిన తెలుగుశాఖ అధ్యాపకులు పిట్ల దాసు, నారోజు వెంకటరమణ, నరేశ్, శైలజ, రామస్వామి, సాయిసురేశ్ లకు, భాషా సాంస్కృతిక విభాగం సభ్యులను అభినందించారు.

నేడు ఎన్నికల నియమావళిపై అభ్యర్థులకు అవగాహన

మద్దూరు/కొండపాక, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి) : మద్దూరు, దూళిమిట్ట మండలాల్లోని రైతు వేదికల్లో గ్రామ పంచాయతీల సర్పంచ్‌ల, వార్డు సభ్యుల స్థానాలకు పోటీ చేస్తున్న అభ్యర్థులకు బుధవారం ఎన్నికల నియమావళి, ఎన్నికల వ్యయంపై అవగాహన సమావేశాన్ని ఏర్పాటు చేసినట్లు ఆయా మండలాల ఎంపీడీవోలు రాంమోహన్, వీరరాజ్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 10.30 గంటలకు మద్దూరు మండల కేంద్రంలోని రైతువేదికలో, మధ్యాహ్నం 2 గంటలకు దూళిమిట్ట మండల కేంద్రంలోని రైతు వేదికలో జరిగే సమావేశాలకు అభ్యర్థులు తప్పక హాజరు కావాలని తెలిపారు. అదేవిధంగా కొండపాక మండల పరిధిలోని గ్రామ పంచాయతీల్లో పోటీ చేసే అభ్యర్థులకు కొండపాక సమీకృత కార్యాలయ సముదాయ భవనంలో ఉదయం 11 గంటలకు అవగాహన సమావేశాన్ని నిర్వహించనున్నట్టు ఎంపీడీవో వెంకటేశ్వర్లు తెలిపారు.

ధనుర్మాస వేడుకల కరపత్రాల ఆవిష్కరణ



ఆలయ ఆవరణలో కరపత్రాలను ఆవిష్కరిస్తున్న భక్తులు

చేర్యాల, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): చేర్యాల పట్టణంలోని వేణుగోపాలస్వామి ఆలయంలో ఈ నెల 16నుంచి నిర్వహించనున్న ధనుర్మాసోత్సవాల కరపత్రాలను మంగళవారం ఆలయ నిర్వాహకులు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆలయ ప్రధానార్చకుడు మంగళగిరి శేషాచార్యులు మాట్లాడుతూ ధనుర్మాసం సందర్భంగా నిత్యం ఆలయంలో విశేషపూజలు జరుపనున్నట్టు తెలిపారు.

ప్రభుత్వ భూమిలో ఆక్రమణల కూల్చివేత

జిన్నారం, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి) : జిన్నారం మండలం కాజీపల్లిలోని 181 సర్వే నంబరు ప్రభుత్వ భూమిలో అక్రమంగా నిర్మించిన నిర్మాణాలను ఆర్ఐ జయప్రకాశ్‌నారాయణ, రెవెన్యూ సిబ్బంది ఎక్స్‌కవేటర్లతో కూల్చేయించారు. రూ.60 కోట్ల విలువైన ప్రభుత్వ స్థలంలో జరుగుతున్న కబ్జాలపై స్థానికులు రెవెన్యూ అధికారులకు ఫిర్యాదు చేయడంతో తహసీల్దార్ ఆదేశంతో కూల్చివేతలు చేపట్టామని ఆర్ఐ తెలిపారు.

విద్యార్థుల ఇక్కట్లు తప్పినట్టే

- ఎన్నో ఏళ్ల క్రితం చేర్యాలకు దూరంగా డిగ్రీ, పాలిటెక్నిక్ కళాశాలల ఏర్పాటు
- ఉదయం పూట బస్సు లేక ప్రైవేట్ వాహనాలను ఆశ్రయిస్తూ ఇబ్బందులు ఎదుర్కొన్న విద్యార్థులు
- ఎట్టకేలకు మంగళవారం బస్సు సర్వీసు ప్రారంభం



చేర్యాలలోని అంగడిబజారు క్రాస్‌రోడ్డు వద్ద లిఫ్ట్ కోసం ఎదురుచూస్తున్న విద్యార్థులు



కళాశాల విద్యార్థులకు ఏర్పాటైన ఆర్టీసీ బస్సు

చేర్యాల, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): చేర్యాల ప్రభుత్వ డిగ్రీ, పాలిటెక్నిక్ కళాశాల విద్యార్థులు, అధ్యాపకులకు ఇక నుంచి రవాణా కష్టాలు తీరనున్నాయి. ఆకునూరు దారిలో పట్టణానికి శివారులో చాలాయేళ్ల క్రితం ప్రభుత్వ పాలిటెక్నిక్, డిగ్రీ కళాశాలలు నిర్మించారు. కానీ పట్టణం నుంచి దూరంగా ఉండటంతో ఉదయం బస్సుసౌకర్యం లేక ఆయా కళాశాలల తరగతులకు సమయా నికి చేరుకోలేక విద్యార్థులతో పాటు పలువురు అధ్యాపకులు తీవ్ర ఇబ్బందులుపడుతున్నారు. స్థానిక అంగడిబజారు క్రాస్‌రోడ్డు వద్ద నిలబడి లిఫ్ట్ కోసం వాహనదారులను ప్రాధేయపడుతున్న దయనీయ పరిస్థితి నిత్యకృత్యమైంది.

పలువురు విద్యార్థులు అద్దె భవనాల్లో బస చేస్తుండటంతో ప్రైవేటు ఆటోలను అద్దెకు తీసుకుని పరిమితికిమించి కూర్చుని ప్రమాదకర పరిస్థితుల నడుమ ప్రయాణం చేస్తున్నారు. రవాణా సౌకర్యం కల్పించేందుకు ప్రజాప్రతినిధులు హామీ ఇచ్చి యేళ్లు గడిచినా అమలుకు నోచుకోకపోవడం గమనార్హం. ప్రైవేట్ వాహనాల్లో ఓవర్‌లోడ్‌తో ప్రయాణిస్తూ రక్షణ కరువై ఆయా కళాశాలలకు వెళ్లాలంటేను విద్యార్థులు జంకుతున్నారు.

ఎట్టకేలకు స్పందించిన అధికారులు

ఉదయం వేళ ఆర్టీసీ బస్సు సౌకర్యం కల్పించాలని విద్యార్థులు చాన్నాళ్లుగా కోరుతూ వస్తుండగా, ఎట్టకేలకు సంబంధిత అధికారులు స్పందించారు. ప్రతీ నిత్యం ఉదయం 9-30గంటలకు ఆర్టీసీ బస్టాండు నుంచి కళాశాల వరకు ఒక ట్రిప్పు బస్సు నడిపించేందుకు చర్యలు తీసుకుని మంగళవారం ప్రారంభించారు. ప్రభుత్వం ఇప్పటికే మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం కల్పించడంతో విద్యార్థినులు ఉచితంగా, పురుషులు, యువకులకు టికెట్ నిర్ణీత రుసుము తీసుకుని ప్రయాణించే అవకాశం కల్పించారు. దీంతో ఉదయం వేళ ఆర్టీసీ బస్సులో కళాశాలకు చేరుకునే సౌకర్యం అందుబాటులోకి రావడంతో విద్యార్థులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

గ్రామస్థుల రుణం తీర్చుకోలేనిది

ప్రజలకు నిరంతరం అండగా ఉంటూ సేవ చేస్తా

ఆలయాల అభివృద్ధికి, సదుపాయాల కల్పనకు కృషి

రంగంపేట ఏకగ్రీవ సర్పంచ్ అభ్యర్థి నడిగొప్పుల నాగరాజు



నడిగొప్పుల నాగరాజు

గజ్వేల్‌రూరల్, డిసెంబరు 9(ఆంధ్రజ్యోతి): తనను ఏకగ్రీవ సర్పంచ్‌గా ఎన్నుకున్న గ్రామ ప్రజల రుణం తీర్చుకోలేనిదని రంగంపేట సర్పంచ్ నడిగొప్పుల నాగరాజు పేర్కొన్నారు. గజ్వేల్ మండలంలో ఏకైక ఏకగ్రీవ సర్పంచ్‌గా తనను ఎన్నుకున్న గ్రామ ప్రజలకు నిరంతరం అండగా ఉంటూ సేవ చేస్తానని, గ్రామ ప్రజలకు ఏ సమస్య వచ్చినా వెంటనే స్పందించి వాటి పరిష్కారానికి కృషి చేస్తానన్నారు. గత ఐదేళ్ల తన తల్లి సర్పంచ్‌గా పనిచేసిందని, మరో ఐదేళ్ల తనకు అవకాశం ఇవ్వడం తన పూర్వజన్మ సుకృతమన్నారు. రంగంపేట గ్రామంలో మౌళిక సదుపాయాల కల్పనకు కృషి చేస్తానని, ఆలయాల అభివృద్ధికి కృషి చేస్తానన్నారు. ముఖ్యంగా గ్రామంలో సీసీ రోడ్లు, వీధి దీపాలు, పారిశుధ్యంపై ప్రత్యేక దృష్టి పెడతానన్నారు. గజ్వేల్ మండలంలోనే ఆదర్శ గ్రామంగా రంగంపేటను తీర్చిదిద్దేందుకు గ్రామ ప్రజల సహకారంతో, అధికారుల సహకారంతో నిరంతరం కృషి చేస్తానని స్పష్టం చేశారు. ప్రభుత్వ పథకాలను ప్రజలకు చేర్చడంలో తనవంతుగా కీలక పాత్ర పోషిస్తానని, ప్రజల సూచనల మేరకు పనిచేస్తానని ప్రకటించారు.



దుబ్బాక: హబ్షీపూర్‌లో దుబ్బాక సీఐ శ్రీనివాస్ ఆధ్వర్యంలో ఫ్లాగ్‌మార్చ్

శాంతిభద్రతల పరిరక్షణపై ప్రజల్లో భరోసా కల్పించేందుకే పోలీసుల ఫ్లాగ్‌మార్చ్

దుబ్బాక/మిరుదొడ్డి, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): గ్రామపంచాయతీ ఎన్నికల సందర్భంగా ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా, ప్రశాంత వాతావరణంలో ఎన్నికలు జరిగేలా చర్యలు తీసుకుంటున్నామని దుబ్బాక సీఐ పాలెపు శ్రీనివాస్ తెలిపారు. శాంతిభద్రతల పరిరక్షణపై ప్రజల్లో భరోసా కల్పించేందుకే పోలీసులు ఫ్లాగ్‌మార్చ్ నిర్వహిస్తున్నట్టు సీఐ వివరించారు. మంగళవారం దుబ్బాక మండలంలోని హబ్షీపూర్ గ్రామంలో ఏఆర్ పోలీస్ సిబ్బంది, స్థానిక పోలీసుల సహకారంతో గ్రామంలోని ప్రధాన వీధుల గుండా ఫ్లాగ్‌మార్చ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..ప్రజలందరూ తమ ఓటు హక్కును స్వేచ్ఛగా వినియోగించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో దుబ్బాక ఎస్ఐ కె.కీర్తి రాజు, ఏఆర్ ఎస్ఐలు పోలీస్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు. మిరుదొడ్డిలో ఎస్ఐ సమత ఆధ్వర్యంలో ప్రత్యేక పోలీసబలగాలతో ఫ్లాగ్ మార్చ్‌ను నిర్వహించారు. ఓటర్లు వివిధ రకాల ప్రలోభాలకు లొంగకుండా ఓటు హక్కును సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో దుబ్బాక ఎస్ఐ కీర్తిరాజు, పోలీస్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

వరి కొయ్యలను కాల్చితే భూమికి నష్టం





కొండపాక మండలం వెలికట్టలో వరి కొయ్యలు కాల్చడంతో నష్టాలపై అవగాహన కల్పిస్తున్న వ్యవసాయ శాఖ జిల్లా అధికారి స్వరూపారాణి, కోహెడలో నారుమడులను పరిశీలిస్తున్న ఏవో సతీష్

కొండపాక, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): వరి కొయ్యలను కాల్చడం వల్ల భూమికి నష్టం వాటిల్లుతుందని జిల్లా వ్యవసాయ శాఖ అధికారి స్వరూపారాణి తెలిపారు కొండపాక మండలం వెలికట్ట గ్రామంలో మంగళవారం రైతు వాసరి మధుసూదన్ వరి పొలంలో వరి కొయ్యలను కాల్చడంపై అవగాహన కల్పించారు. వరికొయ్యలను కాల్చితే భూమికి, అలాగే రైతుకు నష్టం తప్పదన్నారు. వరి కొయ్యలను కాల్చితే విపరీతమైన వేడితో నత్రజని, ఫాస్పరస్ లాంటి పోషక పదార్థాల శాతం తగ్గుతుందన్నారు. పంటలకు అవసరమైన ఖనిజ లవణాలు దెబ్బతింటాయని, పొలాల్లో తిరిగే పాములు, ఉడుము, తొండల్లాంటి అనేక రకాల జీవరాశులు చనిపోయి, ప్రకృతి సమతుల్యత దెబ్బతింటుందని వివరించారు. వరి కొయ్యలను నేలలో కలియ దున్నడం వల్ల సేంద్రియ కర్బనశాతం పెరిగి దిగుబడులు 5 నుంచి 10 శాతం వరకు అధికంగా వచ్చే అవకాశముందన్నారు. దుక్కిదున్నే సమయంలో సింగిల్ సూపర్ ఫాస్ఫేట్ లేదా వేస్ట్ డీ కంపోజర్ చల్లితే వరి కొయ్యల అవశేషాలు రెండు వారాల్లో మురిగి పోషకాలుగా అందుబాటులోకి వస్తాయన్నారు. సూపర్ ఫాస్ఫేట్ చల్లితే భూమి చౌడుబారడం నుంచి తప్పించడమే కాకుండా భూమిలో సేంద్రియ పదార్థాల స్థాయిని పెంచుతుందన్నారు. కలియదున్నడంతో ఎకరాకు టన్ను వరకు ఎరువు తయారవుతుందని సూచించారు. కార్యక్రమంలో ఏఈవో రమ్యశ్రీ, రైతులు పాల్గొన్నారు.

వరి నారుమడులు పరిశీలన

కోహెడ, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని వరి నారుమడులను మండల వ్యవసాయ అధికారి సతీష్ మంగళవారం సందర్శించారు. ఈ సందర్భంగా ఏవో మాట్లాడుతూ యాసంగి వరి నారుమడుల్లో తీసుకోవలసిన యాజమాన్య పద్ధతులను రైతులకు వివరించారు. వెంట ఏఈవో శ్రీధర్‌రెడ్డి, రైతులు మంద ప్రభాకర్, నవీన్ ఉన్నారు.



మిరుదొడ్డిలో ప్రిసైడింగ్ అధికారులనుద్దేశించి మాట్లాడుతున్న జెడ్పీ సీఈవో రమేష్

ఎన్నికలు సజావుగా జరిపించాలి

మిరుదొడ్డి, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): గ్రామపంచాయతీ ఎన్నికలు సజావుగా జరిగేవిధంగా చూడాలని ఎన్నికలు జెడ్పీ సీఈవో రమేష్ సూచించారు. మంగళవారం మిరుదొడ్డి రైతువేదికలో రెండో విడత ఎన్నికల్లో భాగంగా ప్రిసైడింగ్ అధికారులకు ఎన్నికల శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించగా, సీఈవో పాల్గొని మాట్లాడారు. గ్రామాల్లోని ఓటర్లు ఓటుహక్కును వినియోగించుకోవాలని సూచించారు. అధికారులు పాటించాల్సిన విధులు, విధానాలను క్లుప్తంగా వివరించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ గణేష్‌రెడ్డి, ఎంపీవో ఫహీం, ఎంఈవో ప్రవీణ్‌బాబు, మాస్టర్ ట్రైనర్స్ ఉన్నారు.

అభ్యర్థులకు గుర్తుల కేటాయింపు



కొమురవెల్లిలో కేటాయించిన గుర్తుల వివరాలను ఆసక్తిగా తెలుసుకుంటున్న అభ్యర్థులు

కొమురవెల్లి, డిసెంబర్ 9 (ఆంధ్రజ్యోతి): స్థానిక సంస్థల సర్పంచ్ ఎన్నికల్లో భాగంగా నామినేషన్ల ఉపసంహరణ ప్రకియ మంగళవారం ముగియడంతో ఎన్నికల అధికారులు పోటీలో నిలబడిన అభ్యర్థులకు గుర్తులను కేటాయించారు. తమకు ఏ గుర్తు వస్తుందో అంటూ అభ్యర్థులు నామినేషన్ కేంద్రాల ముందు ఆత్రుతగా వేచిచూశారు. గుర్తులు కేటాయింపు పూర్తవడంతో ఇక నుంచి అభ్యర్థులు ప్రచారాన్ని ముమ్మరం చేయనున్నారు.

ఘనంగా విజయ దివస్



తెలంగాణ తల్లి ఫ్లెక్సీకి క్షీరాభిషేకం చేస్తున్న బీఆర్ఎస్ నాయకులు

హుస్నాబాద్, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): హుస్నాబాద్ పట్టణంలో మంగళవారం విజయ దీక్షా దివస్ వేడుకలను బీఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. పట్టణంలోని అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి తెలంగాణ తల్లి ఫ్లెక్సీకి క్షీరాభిషేకం చేశారు. అనంతరం ప్రభుత్వ ఆసుపత్రిలో రోగులకు పండ్లు పంపిణీ చేశారు. కేసీఆర్ దీక్ష వల్లనే తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు ప్రక్రియ ప్రారంభమైందన్నారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నియోజకవర్గ అధికార ప్రతినిధులు సుద్దాల చంద్రయ్య, అయిలేని మల్లిఖార్జున్‌రెడ్డి, మున్సిపల్ మాజీ చైర్‌పర్సన్ ఆకుల రజిత, మాజీ ఎంపీపీ ఆకుల వెంకట్, బీఆర్ఎస్ పట్టణ అధ్యక్షుడు ఎండీ అన్వర్, నాయకులు వంగ వెంకట్రాంరెడ్డి, పెరుక భాగ్యరెడ్డి, గూళ్ళ రాజు, స్వరూప, శ్రీనివాస్ తదితరులున్నారు.

ఘనంగా సోనియా జన్మదిన వేడుకలు







సిద్దిపేట, హుస్నాబాద్‌లలో సోనియా జన్మదిన కేక్‌ను కట్ చేస్తున్న కాంగ్రెస్ నాయకులు, మద్దూరులో చిత్రపటం వద్ద జన్మదిన శుభాకాంక్షలు తెలుపుతున్న నాయకులు

సిద్దిపేట/హుస్నాబాద్ టౌన్/మద్దూరు డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): జిల్లా వ్యాప్తంగా సోనియాగాంధీ జన్మదినవేడుకలను మంగళవారం కాంగ్రెస్ శ్రేణులు ఘనంగా జరుపుకున్నాయి. సిద్దిపేట పట్టణంలోని ముస్తాబాద్ చౌరస్తా వద్ద ఏఐసీసీ నాయకురాలు సోనియాగాంధీ జన్మదినం సందర్భంగా పట్టణ కాంగ్రెస్ ఆధ్వర్యంలో కేక్ కట్ చేసి వేడుకలను ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ పార్టీ సిద్దిపేట నియోజకవర్గ ఇన్‌చార్జి పూజల హరికృష్ణ, పట్టణ అధ్యక్షుడు అత్తుఇమామ్ మాట్లాడుతూ.. తెలంగాణ ప్రజల ఆకాంక్ష మేరకు ప్రత్యేక రాష్ట్రాన్ని ఇచ్చిన దేవత సోనియాగాంధీ అని కొనియాడారు. కార్యక్రమంలో నాయకులు సాకి ఆనంద్, మార్క సతీష్‌గౌడ్, రియాజుద్దీన్, పూజల గోపికృష్ణ, గ్యాదరి మధు, తదితరులు పాల్గొన్నారు. హుస్నాబాద్ పట్టణంలోని అంబేడ్కర్ చౌరస్తాలో సోనియాగాంధీ జన్మదినం సందర్భంగా కాంగ్రెస్ నాయకులు కేక్‌ను కట్‌చేసి పంపిణీ చేశారు. కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ కేడం లింగమూర్తి, సింగిల్ విండో ఛైర్మన్ బొలిశెట్టి శివయ్య, నాయకులు చిత్తారి రవీందర్, వీవీ రమణ తదితరులున్నారు. మద్దూరు, మండల కేంద్రంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో మండల పార్టీ అధ్యక్షులు మేక మల్లేశం ఆధ్వర్యంలో కాంగ్రెస్ అధినేత్రి సోనియాగాంధీ జన్మదిన వేడుకల్ని ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో గ్రామశాఖ అధ్యక్షుడు షౌకత్ అలీ, మాజీ సర్పంచ్ రామడుగు బాల్‌రాజ్, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఒట్టెయ్.. ఓటేయ్..!

(5వ పేజీ తరువాయి)

ఇక కొన్ని గ్రామాల్లో బెల్టుషాపుల నిర్వాహకులు కూడా గుట్టుచప్పుడు కాకుండా తమ దందాను కొనసాగిస్తున్నారు. ఇతరుల ఇళ్లలో మద్యం సీసాలు నిల్వ చేసి అభ్యర్థులు చెప్పినవారికి సీసాలు అందేలా జాగ్రత్త పడుతున్నారు.

చీరలు.. వెండి.. మాంసం.. నోటు

ఎన్నికలకు ఒక్కరోజు మాత్రమే సమయం ఉండడంతో పంపకాలు ప్రారంభించారు. సర్పంచ్, వార్డు సభ్యుల రేసులో ఉన్నవారు మహిళలకు చీరలు అందజేస్తున్నారు. వెండితో తయారుచేసిన చిన్నపాటి కుంకుమ భరిణిలు, లక్ష్మీ అమ్మవారి ప్రతిమలను సెంటిమెంట్‌గా ఓటర్లకు అందజేసి ప్రమాణం తీసుకుంటున్నారు. ఇక కిలో చొప్పున మటన్, చికెన్ మాంసంతోపాటు మద్యం, కూల్‌డ్రింకులను చేరవేస్తున్నారు. పోటీ తీవ్రంగా ఉన్న గ్రామాల్లో దేవుడి బొమ్మపై నోటు పెట్టి అందిస్తున్నారు. తమకే ఓటు వేయాలని మరీమరీ ఒట్టు వేయించుకుంటున్న పరిస్థితి ప్రస్తుతం గ్రామాల్లో నెలకొంది.

డ్రంకెన్ డ్రైవ్‌లో ఆరుగురికి జరిమానా.. ఇద్దరికి జైలు

గజ్వేల్, డిసెంబరు 9(ఆంధ్రజ్యోతి): గజ్వేల్ పట్టణంలోని వివిధ ప్రాంతాల్లో ఇటీవల పోలీసులు నిర్వహించిన డ్రంకెన్‌డ్రైవ్‌లో 8 మంది పట్టుబడ్డారు. వారిని మంగళవారం కోర్టులో హాజరుపరచగా ఆరుగురికి జరిమానా, ఇద్దరికి జైలు శిక్ష విధిస్తూ న్యాయాధికారి తీర్పు చెప్పారు. గజ్వేల్ ట్రాఫిక్ సీఐ ఎం. మురళి తెలిపిన వివరాల ప్రకారం.. పట్టణంలో ఇటీవల మద్యం తాగి డ్రైవింగ్ చేస్తూ పట్టుబడినవారిని గజ్వేల్ జ్యుడీషియల్ ఫస్ట్‌క్లాస్ మెజిస్ట్రేట్ మూల స్వాతిగౌడ్ ఎదుట కోర్టులో హాజరుపరచగా విచారణ అనంతరం ఆరుగురికి రూ.33వేల జరిమానా విధించారు. మరో ఇద్దరికి రెండు రోజుల జైలు శిక్ష విధిస్తూ తీర్పును వెల్లడించారు.

వీధి వ్యాపారులు అధికారులకు సహకరించాలి



సిద్దిపేట మున్సిపల్ కార్యాలయంలో మాట్లాడుతున్న మెప్మా పీడీ హనుమంతరావు

సిద్దిపేట డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): మున్సిపల్, పోలీసు అధికారులకు వీధి విక్రయదారులు సహకరించాలని సిద్దిపేట మున్సిపల్ చైర్‌పర్సన్ మంజులారాజనర్సు తెలిపారు. మంగళవారం సిద్దిపేట పట్టణంలోని మున్సిపల్ కార్యాలయంలో మెప్మా ఆధ్వర్యంలో వీధి విక్రయ దుకాణదారులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో నూతన టౌన్ వెండింగ్ కమిటీ నియామకం, చేపట్టాల్సిన పలు అంశాలపై మున్సిపల్ కమిషనర్ ఆశ్రిత్‌కుమార్, మెప్మా పీడీ హనుమంతరావులతో కలిసి మున్సిపల్ చైర్‌పర్సన్ మంజులరాజనర్సు దుకాణదారులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పట్టణంలో 11 మంది సభ్యులతో కూడిన నూతన టౌన్ వెండింగ్ కమిటీని త్వరగా నియమించాలని, కమిటీలో మున్సిపల్ చైర్‌పర్సన్, కమిషనర్, టౌన్ ప్లానింగ్, అడ్వకేట్, పోలీసు, స్వచ్ఛంద సంస్థ సభ్యులు, వైద్యాధికారులు, నలుగురు వీధి వ్యాపార సభ్యులు, బ్యాంకు అధికారులు భాగస్వాములుగా ఉండాలన్నారు. రాష్ట్రంలో ఎక్కడలేని విధంగా సిద్దిపేట పట్టణంలో మాజీ మంత్రి హరీశ్‌రావు సహకారంతో ముస్తాబాద్ చౌరస్తాలో వీధి వ్యాపారుల దుకాణ సముదాయాల కోసం 40 దుకాణాలు నిర్మించినట్టు తెలిపారు. కార్యక్రమంలో ట్రాఫిక్ ఎస్ఐ ఉమేష్, టౌన్ ప్లానింగ్ అధికారులు దేవరాజ్, ప్రవీణ్, ఎఈ శ్రీనాథ్, మెప్మా అధికారులు రేణుక, జ్యోతి, స్వచ్ఛంద సంస్థ నిర్వాహకులు జోజి తదితరులు పాల్గొన్నారు.

తహసీల్దార్ కార్యాలయం ఎదుట రైతుల ఆందోళన



బెజ్జంకి తహసీల్దార్ కార్యాలయం ఎదుట ఆందోళన చేస్తున్న రైతులు

బెజ్జంకి, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి) : కొనుగోలు కేంద్రాల్లో తూకం వేసిన ధాన్యం బస్తాలను మిల్లర్లు దించుకోక ఇబ్బందులకు గురి చేస్తున్నారని మంగళవారం తహసీల్దార్ కార్యాలయం ఎదుట రైతులు ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మండల కేంద్రంలోని వ్యవసాయ మార్కెట్ యార్డ్‌లో ధాన్యం బస్తాలను తూకం వేసి రోజులు గడుస్తున్నాయని ఆరోపించారు. తూకం వేసిన ధాన్యం బస్తాలను కేటాయించిన మిల్లులకు తరలిస్తే మిల్లర్లు ధాన్యాన్ని దించుకోకుండా ఇబ్బందులకు గురి చేస్తున్నారని మండిపడ్డారు, ఒక్కో బస్తాకు మిలర్లు 6 కిలోల చొప్పున కోత పెడుతున్నారని వాపోయారు. కోతలు లేకుండా ధాన్యం బస్తాలను దించుకోవాలని వారు డిమాండ్ చేశారు. రైతులు ఈ సమస్యను తహసీల్దార్ శ్రీకాంత్ దృష్టికి తీసుకెళ్లగా ఆయన వెంటనే డీఎస్‌వోకు సమస్యను ఫోన్‌లో వివరించారు. మిల్లర్లతో మాట్లాడి రైతులకు ఇబ్బందులు కలుగకుండా చూస్తామని డీఎస్‌వో తెలిపారు. కాగా మండల వ్యాప్తంగా ఆయా గ్రామాల్లోని కొనుగోలు కేంద్రాల్లో తూకం వేసిన ధాన్యం బస్తాలు 10 వేల వరకు ఉన్నట్లు సమాచారం.

కాంగ్రెస్ బెదిరింపులకు భయపడే ప్రసక్తే లేదు



మామిడాలలో కార్యకర్తల సమావేశంలో మాట్లాడుతున్న వంటేరు ప్రతాప్‌రెడ్డి

ములుగు/గజ్వేల్, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): గ్రామపంచాయతీ ఎన్నికల్లో కాంగ్రెస్ ప్రభుత్వం బీఆర్ఎస్ నాయకులను భయభ్రాంతులకు గురి చేస్తే భయపడే ప్రసక్తే లేదని నియోజకవర్గం ఇన్‌చార్జి వంటేరు ప్రతాప్‌రెడ్డి పేర్కొన్నారు. మంగళవారం ములుగు మండలం ఆర్అండ్ఆర్ కాలనీ మామిడాలలో కార్యకర్తల సమావేశం నిర్వహించారు. సమావేశంలో ఆయన మాట్లాడుతూ అధికార పార్టీ ఎన్ని జిమ్మిక్కులు చేసినా ప్రజలు కేసీఆర్ వెంటే ఉన్నారన్నారు. పంచాయతీ ఎన్నికల్లో ప్రజలు బీఆర్ఎస్ పార్టీ అభ్యర్థులకు అత్యధిక మెజార్టీ సాధించే విధంగా కార్యకర్తలు పని చేయాలని కోరారు. మండల పార్టీ అధ్యక్షుడు జహంగీర్, మార్కెట్ కమిటీ మాజీ వైస్ చైర్మన్ కోడూరు భూపాల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు. గజ్వేల్ నియోజకవర్గంలోని మెజారిటీ గ్రామాల్లో బీఆర్ఎస్ పార్టీ బలపరిచిన అభ్యర్థులు ఘనవిజయం సాధించడం ఖాయమని బీఆర్ఎస్ గజ్వేల్ నియోజకవర్గ ఇన్‌చార్జి వంటేరు ప్రతాప్‌రెడ్డి ధీమా వ్యక్తం చేశారు. గజ్వేల్ మండల పరిధిలోని ఆయా గ్రామాల్లో బీఆర్ఎస్ బలపరిచిన అభ్యర్థులకు మద్దతుగా ఎన్నికల ప్రచారంలో పాల్గొన్నారు.

మల్లన్న ఆలయానికి జిరాక్స్ మిషన్ వితరణ



ఆలయ అధికారులకు జిరాక్స్ మిషన్‌ను అందిస్తున్న బ్యాంక్ అధికారులు

కొమురవెల్లి, డిసెంబర్ 9 (ఆంధ్రజ్యోతి): ప్రముఖ శైవక్షేత్రం కొమురవెల్లి మల్లికార్జున స్వామి ఆలయానికి స్థానిక తెలంగాణ గ్రామీణ బ్యాంక్ అధికారులు రూ.95,000 వేల విలువైన జిరాక్స్ మిషన్‌ను ఆలయ కార్యనిర్వహణాధికారి టంకశాల వెంకటేష్‌కు మంగళవారం అందించారు. కార్యక్రమంలో తెలంగాణ గ్రామీణ బ్యాంక్ జనరల్ మేనేజర్ సుధాకర్, రీజినల్ మేనేజర్ ఉదయ్‌కిరణ్, మేనేజర్ సంతోష్, బ్యాంక్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

మృతురాలి కుటుంబానికి ఆర్థిక సహాయం



ఆర్థిక సాయం అందజేస్తున్న అంజిరెడ్డి

ములుగు, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): అనారోగ్యంతో మృతి చెందిన మహిళ కుటుంబానికి ఉమ్మడి మెదక్ జిల్లా డీసీసీబీ డైరెక్టర్ బట్టు అంజిరెడ్డి అండగా నిలిచారు. వివరాల్లోకి వెళ్తే.. మండలకేంద్రంలో అనారోగ్యంతో ఆనగల్ల పద్మ అనే మహిళ మృతి చెందింది. ఈ విషయం తెలిసిన డీసీసీబీ డైరెక్టర్ అంజిరెడ్డి మృతురాలి కుటుంబ సభ్యులను మంగళవారం పరామర్శించి రూ.10 వేల ఆర్థికసాయాన్ని అందజేశారు. వెంట మైనార్టీ రాష్ట్ర యూత్ విభాగం ఉపాధ్యక్షుడు జుబేర్, కనకయ్య, శ్రీనివాస్‌గౌడ్‌తో పాటు తదితరులున్నారు.